



# వార్తాప్రభ


RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ








విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 50 | ది. 23-5-2026 | శనివారం | పేజీలు : 8 | వెల : రూ.1/-

VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 50 | Date : 23-5-2026 | Saturday | Pages : 8 | Rs.1/-


## రాజ్యసభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల..

### ఏపీలో ఖాళీ అవుతున్న 4 రాజ్యసభ స్థానాలు

- జూన్, జులై నెలల్లో ముగియనున్న 24 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం
- జూన్ 18న పోలింగ్.. అదే రోజున ఫలితాలు
- ఏపీలో 4 స్థానాలు కూటమి ఖాతాలోకి వెళ్లడం లాంఛనమే



**న్యూఢిల్లీ,మే 22 (వార్తాప్రభ) :** దేశవ్యాప్తంగా ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాల భర్తీకి కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసింది. జూన్, జులై నెలల్లో పదవీకాలం ముగియనున్న 10 రాష్ట్రాల్లోని మొత్తం 24 రాజ్యసభ స్థానాలకు ఈ ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన 4 కీలక స్థానాలు కూడా ఉన్నాయి. ఈ మేరకు ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. జూన్ 1న నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ జూన్ 8 వరకు,పోలింగ్, ఫలితాలు జూన్ 18 అని ప్రకటించింది.

**ఆంధ్రప్రదేశ్‌లో ఖాళీ కానున్న 4 స్థానాలు..** వైయస్సార్సీపి నుండి అయోధ్య రామిరెడ్డి,పిల్లి సుభాష్ చంద్రబోస్,పరిమళ్ నత్వానీ కాగా టిడిపి నుంచి సానా సతీష్ బాబు రిటైర్ కానున్నారు. ప్రస్తుత అసెంబ్లీ సంఖ్యాబలం ప్రకారం ఏపీలోని ఈ నాలుగు స్థానాలూ కూటమి ఖాతాలోకి వెళ్లడం లాంఛనమే. కాకపోతే కూటమిలో సీట్ల సర్దుబాటు, ఎవరెవరికి ఎన్ని సీట్లు అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ విడతలో జాతీయ రాజకీయాల్లోని అత్యంత కీలక నేతల రాజ్యసభ పదవీకాలం ముగుస్తుండటంతో ఈ ఎన్నికలపై అందరి దృష్టి పడింది. సరిగ్గా జూన్ 18న ఒకేరోజు పోలింగ్ జరిపి, అదే రోజు సాయంత్రం ఫలితాలను కూడా ఈసీ ప్రకటించనుంది.

## హీట్ వేవ్ పై రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తత

### ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నచోట స్థానికంగా సెలవుల ప్రకటన

### రాష్ట్రంలో తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలపై సీఎం చంద్రబాబు సమీక్ష



**అమరావతి,మే 22 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో తీవ్రస్థాయిలో నమోదు అవుతున్న ఉష్ణోగ్రతలు, వడ గాల్పుల నేపథ్యంలో ప్రజారోగ్యం, వారి భద్రతపై ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఎండల తీవ్రత దృష్ట్యా అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలను రక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు నిరంతరం హెచ్చరికలు పంపాలని అధికారులకు సూచించారు. ఎండల తీవ్రత మరీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పరిస్థితులను బట్టి స్థానికంగా సెలవులు ప్రకటించాలని దిశానిర్దేశం చేశారు. తీవ్రస్థాయి ఎల్ నినో కారణంగా హీట్ వేవ్ తీవ్రత కూడా గణనీయంగా పెరిగిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన సీఎం ప్రజలకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేలా రద్దీగా ఉన్న ప్రాంతాలు, ప్రజలు ఎక్కువగా తిరిగే చోట్ల చల్లని మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. వడగాలుల నుంచి ఎలా రక్షించు కోవాలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్లు మీడియా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. మీడియాతో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా నిరంతరం సమాచారాన్ని చేరవేయాలని నిర్దేశించారు. ప్రజల ప్రాణాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఎండ తీవ్రత నేపథ్యంలో బయటకు వచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాకుండా ఉండాలని సూచించారు. ఈ అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి జిల్లా కలెక్టర్లు, మండల స్థాయి అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో 1349 హీట్ షెల్టర్లు, చలి వేంద్రాలు ఏర్పాటు చేసినట్టు అధికారులు సీఎంకు వివరించారు. 446 ట్రాఫిక్ జంక్షన్లలో వాహనదారులు, పోలీసులకు నీడ కల్పించేలా ఏర్పాట్లు చేశామని తెలియచేశారు. మరోవైపు ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న మూగ జీవులు, పక్షులకు కూడా నీటి తొట్టెలు, మట్టి కుండలతో నీటిని ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు.

**పచ్చదనం పెంపుపై దృష్టి..** గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా తాగు నీటి కొరత రాకుండా చూడాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. నీటి ఇబ్బందులు ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. 2015లో బలమైన ఎల్ నినో కారణంగా రాష్ట్రంలో 50.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డు అయ్యిందని.. ఈ ఏడాదిలోనూ ఎల్ నినో ప్రభావంతో ఇప్పటి వరకూ 48 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు రాష్ట్రంలో నమోదు అయినట్టు అధికారులు వివరించారు. గడచిన మూడు రోజులుగా 45 డిగ్రీల నుంచి 48 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పెరిగాయన్నారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో పచ్చదనం పెంపుపై దృష్టి సారించాలని సూచించారు. భూగర్భ జలాలు పెరిగితే... పచ్చదనం పెరుగుతుందని... తద్వారా తీవ్ర ఉష్ణోగ్రతల ప్రభావం నుంచి కొంత మేర ఉపశమన లభిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. అన్నమయ్య జిల్లానే దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇతర జిల్లాలతో పోలిస్తే అన్నమయ్య జిల్లాలో తక్కువ ఉష్ణోగ్రత నమోదైందని స్పష్టం చేశారు. తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతాల్లో హెచ్చరికలు, అప్రమత్తత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు సమాచారం చేరవేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. వచ్చే వారం రోజుల పాటు నిత్యం ప్రజలను అప్రమత్తం చేసేలా కార్యాచరణ చేపట్టాలని సీఎం సూచించారు. ఈ సమీక్షకు సీఎస్ సాయి ప్రసాద్, పురపాలక, పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి, విపత్తు నిర్వహణ, వైద్యారోగ్య శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## కిడ్నీ మార్పిడిలో నిమ్స్ రికార్డు..

### వైద్యులను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి

- కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్లో నిమ్స్ ఘనత
- 2000 ఆపరేషన్లు పూర్తి చేసి దేశంలో మూడో స్థానంలో నిలిచిన ఆసుపత్రి
- వైద్య బృందాన్ని ప్రత్యేకంగా అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి
- 95 శాతం ఆపరేషన్లు ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా నిర్వహించడం విశేషం
- దక్షిణ భారత దేశంలో కిడ్నీ మార్పిడులలో నిమ్స్ మొదటి స్థానం



**హైదరాబాద్, మే 22 (వార్తాప్రభ) :** హైదరాబాద్ నగరంలోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) యూరాలజీ విభాగం వైద్య చరిత్రలో అరుదైన మైలురాయిని అందుకుంది. ఇప్పటివరకు 2,000 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసి రికార్డు సృష్టించింది. ఈ చారిత్రక ఘనతను సాధించిన నిమ్స్ వైద్య బృందాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఘనతతో నిమ్స్ ఆసుపత్రి.. కిడ్నీ మార్పిడులలో దక్షిణ భారతదేశంలో మొదటి స్థానంలో, దేశ వ్యాప్తంగా మూడో స్థానంలో నిలిచింది. దేశంలో గుజరాత్‌లోని ఐకేడీఆర్సీ ప్రథమ స్థానంలో, లూధియానా క్రిస్టియన్ మెడికల్ కాలేజీ ద్వితీయ స్థానంలో ఉన్నాయి. నిమ్స్‌లో జరిగిన ఈ 2,000 ఆపరేషన్లలో 1,900 మంది (95 శాతం) రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా కిడ్నీ మార్పిడి చేయించుకోవడం గమనార్హం. గడిచిన మూడు సంవత్సరాల నాలుగు నెలల కాలంలోనే నిమ్స్ వైద్యులు 500 కిడ్నీ మార్పిడులు పూర్తి చేశారు. కిడ్నీ బాధితులకు విశేష సేవలు అందిస్తూ, వారి పాలిట వరంగా నిలుస్తున్న నిమ్స్ వైద్య బృందానికి ముఖ్యమంత్రి ప్రశంసలు తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ పేదలకు అత్యాధునిక వైద్యాన్ని అందించడంలో నిమ్స్ ఆదర్శంగా నిలుస్తోందని ఆయన కొనియాడారు.

## మండే ఎండల్లో పెరుగుతున్న బీర్ అమ్మకాలు



**విజయవాడ, మే 22 (వార్తాప్రభ)** :రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో బీర్ అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. మండుతున్న ఎండల కారణంగా ప్రజలు చల్లని పానీయాలతో పాటు బీర్ వైపు మొగ్గు చూపుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఏప్రిల్ 2025తో పోలిస్తే ఏప్రిల్ 2026లో బీర్ అమ్మకాలు 31.44 శాతం పెరిగాయి. గత ఏడాది ఏప్రిల్‌లో 22.73 లక్షల కేసులు అమ్ముడవగా, ఈ ఏడాది అదే నెలలో 29.88 లక్షల కేసులు విక్రయమయ్యాయి. అలాగే మే నెలలో కూడా అమ్మకాలు భారీగా పెరిగాయి. మే 2025లో తొలి 22 రోజుల్లో 16.42 లక్షల కేసులు అమ్ముడవగా, మే 2026లో అదే కాలానికి 22.21 లక్షల కేసుల అమ్మకాలు నమోదయ్యాయి. ఇది 35.27 శాతం వృద్ధిని సూచిస్తోంది. తీవ్రమైన ఎండలు, అధిక ఉష్ణోగ్రతలు, వేసవి సీజన్ ప్రభావంతో బీర్‌కు డిమాండ్ పెరిగిందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. సాయంత్రం వేళల్లో వైన్ షాపులు, బార్ల వద్ద వినియోగదారుల రద్దీ కూడా పెరిగినట్లు సమాచారం.

## గొడ్డలి పార్టీ సమాజానికి హానికరం

- జగన్ రాజకీయ ముసుగులో ఫ్యాక్షనిస్టు: మంత్రి అచ్చెన్నాయుడు ఫైర్
- అపరిచితుడు క్యారెక్టర్‌లా జగన్ వ్యవహారం
- హత్యా రాజకీయాల అసలు వారసుడు జగన్
- చంద్రబాబు అభివృద్ధి చూసి జగన్ ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారు
- వ్యక్తిగత దూషణలే జగన్ రాజకీయ ఆయుధం
- తెలుగుజాతికి పట్టిన రాజకీయ అరిష్టం జగన్ : మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి, మే 22 (వార్తాప్రభ) :** హత్యా రాజకీయాల పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయ ముసుగులో ఉన్న ఫ్యాక్షనిస్టు అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు. సమాజంలో విద్వేషాలు, హింస, కక్ష రాజకీయాలను పెంచే గొడ్డలి పార్టీ రాష్ట్రానికి హానికరమని మండిపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ జగన్ ప్రెస్‌మీట్‌లో ఫ్రస్ట్రేషన్ స్పష్టంగా కనిపించిందన్నారు. రాష్ట్రంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో శరవేగంగా అభివృద్ధి జరుగుతుంటే తట్టుకోలేక వ్యక్తిగత ఆరోపణలకు దిగుతున్నారని అచ్చెన్నాయుడు అన్నారు. రెండేళ్ల పాలనలో విమర్శించడానికి ఒక్క అంశం కూడా దొరకక చంద్రబాబుపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ లాంటి స్వభావం ఉన్న వ్యక్తులు వస్తారని ముందే గుర్తించి దర్శకుడు శంకర్ అపరిచితుడు సినిమా తీశారేమో అనిపిస్తోంది అంటూ ఎద్దేవా చేశారు. జగన్ చేసిన వ్యాఖ్యలతో రాజారెడ్డి దమనకాండ, నాటి చరిత్ర, వైఎస్ కుటుంబ రాజకీయ నేపథ్యం మొత్తం మళ్లీ చర్చకు వచ్చాయని అన్నారు. నేటి తరానికి వైఎస్ కుటుంబ చరిత్ర తెలిసేలా జగన్ స్వయంగా చేసుకున్నారని వ్యాఖ్యానించారు. రాజారెడ్డి హత్య కేసులో ఉన్న నిందితులందరినీ చంపేశారని, ఒక్క పార్థసారధి రెడ్డి మాత్రమే మిగిలారని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. ఆ కేసుకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తి ఈరోజు వైసీపీలో ప్రధాన కార్యదర్శి హోదాలో ఉన్నాడని పరోక్షంగా ప్రస్తావించారు. అలాగే వంగవీటి రంగ హత్య ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి కుటుంబ సభ్యులు కూడా జగన్ పార్టీలోనే ఉన్నారని గుర్తు చేశారు. రంగా హత్య కేసులో ప్రధాన నిందితుడి కొడుకు నీకు ఎయిర్‌పోర్టులో స్వాగతం పలుకుతాడు... సెండాఫ్ ఇస్తాడు అంటూ జగన్‌ను ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డికి హిందూ దేవుళ్లపై ఎందుకు కక్షో అర్థం కావడం లేదన్నారు. తిరుమల ఏడుకొండల అంశాన్ని ప్రస్తావిస్తూ, నాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రజలు మరచిపోలేదన్నారు. ఆ వ్యాఖ్యలను తప్పుపట్టిన చంద్రబాబు వ్యాఖ్యలను ఇప్పుడు జగన్ వక్రీకరించి ప్రస్తావిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డిని చంపింది జగన్ అని బొత్సనే చెప్పారని నేను చెబితే ఆయన ఎందుకు ఏడ్చారో ఇప్పటికీ అర్థం కాలేదు అని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. రిలయన్స్ సంస్థలపై దాడులు చేయించి, మళ్లీ వాళ్లకు రాజ్యసభ ఇచ్చింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వివేకానందరెడ్డి హత్య కేసులో ఎవరి ప్రమేయం ఉందో రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. నీ సొంత చెల్లెలు వైఎస్ సునీత జగన్ ప్రమేయం ఉందని చెబుతోంది... దానికి సమాధానం చెప్పగలవా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి పదవి కోసం బాబాయినే కాదు, సొంత పార్టీ కార్యకర్తలను కూడా వదల్లేదని తీవ్ర విమర్శలు చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తండ్రి మరణం, బాబాయ్ హత్య, కోడికత్తి డ్రామా గురించి మాట్లాడిన జగన్, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కసారి కూడా వాటిపై మాట్లాడలేదని అచ్చెన్నాయుడు ప్రశ్నించారు.






## రేపు సొంత జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన...

- శనివారం చిత్తూరు జిల్లాలో పర్యటించనున్న సీఎం చంద్రబాబు
- కండ్రిగలో 'సంజీవని' ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం
- సంతగేటు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి, రోగులతో మాట్లాడనున్న ముఖ్యమంత్రి
- పర్యటనలో భాగంగా పార్టీ కేడర్‌తోనూ ప్రత్యేక సమావేశం

**అమరావతి,మే 22 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు (మే 23) సొంత జిల్లా చిత్తూరులో పర్యటించనున్నారు. ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వం తలపెట్టిన 'సంజీవని' కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఈ మేరకు ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ ఖరారైంది. వివరాల్లోకి వెళితే, శనివారం ఉదయం 9 గంటలకు అమరావతిలోని క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి, ఉదయం 11 గంటలకల్లా యాదమర్రి మండలం కండ్రిగ గ్రామానికి చేరుకుంటారు. అక్కడ మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ప్రజా వేదికలో పాల్గొని, 'సంజీవని' కార్యక్రమానికి శ్రీకారం చుడతారు. ఈ కార్యక్రమం అనంతరం, మధ్యాహ్నం 1:35 గంటలకు సీఎం సంతగేటులోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శిస్తారు. అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకుంటారు. ఆ తర్వాత, మధ్యాహ్నం 2:20 గంటలకు సంతగేటు సమీపంలోనే టీడీపీ కార్యకర్తలతో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా కేడర్‌కు పలు అంశాలపై దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశం ముగిసిన అనంతరం, సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి తిరిగి అమరావతికి పయనమవుతారని అధికారులు తెలిపారు.

## మహిళా సంఘాలకు రుణాలపై భట్టివిక్రమార్క శుభవార్త

**హైదరాబాద్, మే 22 (వార్తాప్రభ) :** మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే వడ్డీలేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క చెప్పారు. ప్రజాభవన్‌లో 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మల్లుభట్టి విక్రమార్క మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మహిళా సాధికారత, మూసీ పునరుజ్జీవనం వంటి అంశాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని అన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి లక్ష్యాలను మించి బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు. పారిశ్రామిక రంగంలో దేశంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి అన్నారు. ఈ క్రమంలో సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, మహిళలు, దళిత, గిరిజన, యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీపై బ్యాంకులు మరింత దృష్టి పెట్టాలని అన్నారు.

## ఆయిల్ పామ్ గెలల కోత కార్మికులకు అంపాపురం పతంజలి ఫుడ్స్ భద్రత పరికరములు పంపిణీ



**హనుమాన్ జంక్షన్,మే 22 (వార్తాప్రభ) :** ఆయిల్ పామ్ గెలల కోత కోసేటప్పుడు భద్రత పాటించటం ఎంతో ముఖ్యమని పతంజలి ఫుడ్స్ వైస్ ప్రెసిడెంట్ మరియు బిజినెస్ హెడ్ శ్రీ పూల మల్లేశం తెలిపారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ గెలలు కోసే కార్మికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని బాపులపాడు మండలం వేలేరు గ్రామంలో శుక్రవారం వారికి భద్రత పరికరములు పంపిణీ చేశారు. సమావేశంలో అయన మాట్లాడుతూ గెలలు కోసే కార్మికులు తప్పనిసరిగా గెలల కోత ప్రమాణాలను పాటించాలన్నారు. పక్వానికి వచ్చిన గెలలు కోయటం వలన నూనె శాతం పెరిగి గెలల బరువు పెరుగుతుందన్నారు. తద్వారా రైతులకు, ఫ్యాక్టరీకి, కార్మికులకు లాభం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పతంజలి ఫుడ్స్ జనరల్ మేనేజర్ టి వి రమణ, డిప్యూటీ జనరల్ మేనేజర్ జి వీరేంద్ర చౌదరి, ప్లాంట్ హెడ్ కె శ్రీనివాసరావు, హెచ్ ఆర్ మేనేజర్ జి చంద్రశేఖర్, సిబ్బంది, 250 మంది కోత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## "ఆకెళ్ళ" ఆయనో కదిలే "చలివేంద్రం"



**అమలాపురం,మే 22 (వార్తాప్రభ) :** వేసవికాలం వచ్చిందంటే చాలాచోట్ల స్వచ్ఛంద సంస్థలు, స్థానిక సంస్థలు, దేవాదాయ ధర్మాదాయ శాఖల ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తారు.జనం రద్దీ ఉండే ప్రాంతాలు,అధిక సంఖ్యలో బాటసారులు ప్రయాణించే ప్రాంతాల్లో ఈ చలివేంద్రాలు వేసవికాలంలో ఏర్పాటు చేయడం మనం విరివిగా చూస్తూ ఉంటాము.అయితే దీనికి భిన్నంగా శ్రామిక వర్గం,ఉపాధి కూలీలు, వ్యవసాయ కూలీలు పనిచేసే ప్రాంతాలకే మజ్జిగ తీసుకువెళ్లి అందిస్తున్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకెళ్ళ వెంకట నారాయణమూర్తి. ఇది కదిలే చలివేంద్రంగా స్థానికులు ప్రశంసిస్తున్నారు. మండుటెండలో పొట్టకూటి కోసం పనిచేసే కూలీలను గుర్తించి ఎండ సమయంలో వారికి దాహార్తిని తీర్చడంతో పాటు కోల్పోతున్న శక్తిని తిరిగి రప్పించేందుకు విభిన్నంగా మజ్జిగ తయారు చేసి అందజేస్తున్నారు.వడ దెబ్బ తగలకుండా దబ్బాకులు, నిమ్మరసం, ఉప్పు కలిపిన మజ్జిగ మిశ్రమాన్ని జనాలు గుంపులుగా ఉన్న ప్రాంతాలకు తీసుకెళ్లి ఆయన దాహార్తిని తీరుస్తున్న తీరు ఎందరో ప్రశంసలు అందుకుంటుంది.ఇందుపల్లి గ్రామంలో గత కొన్ని రోజులుగా ఉపాధి హామీ కూలీలు వ్యవసాయ కూలీలు ఎక్కడ పనిచేస్తే అక్కడ మజ్జిగ అందించడంతోపాటు గ్రామంలోని కాలనీలోని ప్రజలకు కూడా మజ్జిగ అందించి ఉపశమనాన్ని కలిగిస్తున్నారు.వృత్తి రీత్యా వేద పండితుడైన ఆయన సమాజ సేవ పట్ల ఉన్న సేవాగుణం అందరి ప్రశంసలు అందుకుంటుంది.

## లక్ష 50 వేలు ఖరీదు చేసే బ్రాస్లెట్ పోగొట్టుకున్న భక్తురాలు

● పోలీస్, హోంగార్డులు వెతికి భక్తురాలుకు అందచేత



**పెనుగంచిప్రోలు, మే 22 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి వచ్చిన ఓ భక్తురాలు పోగొట్టుకున్న బంగారు బ్రాస్లెట్ ను వెతికి బాధితరాలకు ఆలయ హోంగార్డులు అందచేశారు. సూళ్లూరుపేటకు చెందిన ఓ భక్తురాలు తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక వాహనంలో శుక్రవారం తిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి విచ్చేశారు. తమ వాహనం దిగి తిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి వెళుతుండగా మార్గమధ్యంలో తన చేతికి ఉన్న సుమారు 1,50,000 విలువ గల బ్రాస్లెట్ జారిపోయింది.అమ్మవారి దర్శనం అనంతరం తిరిగి బయటికి వచ్చి చూసుకోనుగా తన చేతికి ఉన్న బ్రాస్లెట్ జారిపోయినది అని గ్రహించి వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి ఆలయ హోంగార్డులను ఆశ్రయించారు. దీనిపై పోలీసులు, హోంగార్డులు, ఆలయ ఏఈ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు పరిశీలించి గా తమ వాహనం దిగిన ప్రదేశంలోని బ్రాస్లెట్ జారిపోయిందని అది మరో మహిళలకు దొరికిందని గమనించారు.ఆమె వేసుకున్న దుస్తుల ఆధారంగా వెంటనే ఆమె కోసం గాలింపు చర్యలు చేపట్టి మునేటి అవతల మామిడి తోటలో ఉన్న ఆ మహిళను గుర్తించి ఆమెను విచారించగా గుడి వద్ద తనకు బ్రాస్లెట్ దొరికిందని తెలుపుతూ బ్రాస్లెట్ ను తిరిగి ఇచ్చేసింది.ఆలయ అధికారుల సమక్షంలో బాధితురాలకు ఆ బ్రాస్లెట్ ను హోంగార్డులు అందజేశారు. జరిగిన ఘటనపై వెంటనే స్పందించి సీసీ కెమెరాలు పరిశీలించి పోగొట్టుకున్న బంగారు వస్తువులను తిరిగి అందజేసిన ఆలయ హోంగార్డులను కార్య నిర్వహణ అధికారి బి మహేశ్వర్ రెడ్డి, గ్రామ పెద్దలు, పాలూరు భక్తులు అభినందించారు.

# పెడన నియోజకవర్గం లో మీకోసం

● ప్రజల సమస్యలు విన్న కలెక్టర్...ఎమ్మెల్యే ● 22 ఏ భూముల సమస్య పరిష్కారం

● రెండవ విడత మీకోసం లో అర్జీల వెల్లువ





**పెడన,మే 22 (వార్తాప్రభ) :** ప్రతి నియోజకవర్గంలో 4 శుక్రవారాలు మీకోసం కార్యక్రమం నిర్వహించి పరిష్కరించగలిగే ప్రజల సమస్యలన్నింటినీ తప్పకుండా పరిష్కరించేందుకు ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్ ఎం నవీన్ పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ మీకోసం నోడల్ అధికారి పోతురాజు జడ్పీ సీఈవో డాక్టర్ జై అరుణ డిపిఓ ఎం ధనలక్ష్మి డి.ఎస్.పి శ్రీనివాసరావులతో కలిసి నియోజకవర్గ కేంద్రమైన పెడన ఫంక్షన్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక... మీకోసం కార్యక్రమం నిర్వహించి పెడన నియోజకవర్గంలోని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ ప్రజల సమస్యలను ఎంతో ఓపికగా ఆలకించి సంబంధిత అధికారులను పిలిపించి విచారించి తగిన చర్యలు సానుకూలంగా తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**ఆ ప్రకారంగా మొత్తం 44 అర్జీలు జిల్లా యంత్రాంగం స్వీకరించింది. అందులో కొన్నింటి అర్జీల వివరాలు ఇలా ఉన్నాయి :** పెడన పట్టణం 21 వ వార్డు బ్రహ్మపురానికి చెందిన వాసా దారేశ్వరి తాను ఇంటిలో చేనేత వృత్తిని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని నిరుపేద కుటుంబానికి చెందిన దానినని తనకు పెద్ద పేగు క్యాన్సర్ వచ్చిందని తనకు విరేచనం పేగును బయటపెట్టి ఆపరేషన్ చేశారని గత 2 సంవత్సరాలుగా ఈ వ్యాధితో బాధపడుతున్నానని తనకు ఐదు ఆరుసార్లు విరోచనం జరిగి మార్చవలసి వస్తుందని నెలకు 15 వేల రూపాయల ఖర్చు అవుతుందని రెక్కాడితేగాని డొక్కాడని తన జీవన విధానంలో వృద్ధాప్యంతో వృత్తినే కొనసాగిస్తున్నామని, తన భర్త చాలీచాలని వేతనంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తనకు దివ్యాంగుల పింఛను మంజూరు చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు. గూడూరు మండలం తరకటూరు గ్రామపంచాయతీ తరకటూరు పాలెం శివారు గ్రామంలో 10 ఇల్లు ఉన్నాయని దివ్యాంగులు వృద్ధులు పిల్లలు ఉన్నారని తాగునీటికి చాలా ఇబ్బంది పడుతున్నామని తాగునీటి వసతి కల్పించాలని కోరుతూ ఆ గ్రామవాసులు కోన నాంచారమ్మ సిహెచ్ వెంకటరమణ ఏ శ్రావణి తదితరులు అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక నెలలో నాలుగు శుక్రవారాలు వరసగా ఒకే నియోజకవర్గంలోని ప్రధాన కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక....మీకోసం కార్యక్రమం నిర్వహించాల్సి ఉందన్నారు. జిల్లా అధికార యంత్రాంగం అంతా ఒకే చోట చేరి నాలుగు వారాల్లో పరిష్కరించగలిగే సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో మొదటగా పెడన నియోజకవర్గం ఎంచుకున్నామన్నారు. ప్రస్తుతం రెండోసారి పెడన నియోజకవర్గంలో మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇంకా రెండు శుక్రవారాలు కూడా ఇదే ప్రదేశానికి వస్తామన్నారు. ఒక హర్షనీయమైన విషయం ఏమిటంటే గత శుక్రవారం వచ్చినప్పుడు 11 ఎకరాల 92 సెంట్లు భూమి 22- ఏ నిషేధిత భూముల జాబితాలో ఉందని చాలామంది వచ్చి తాము దాదాపు150 కుటుంబాలు ఉన్నామని ఇబ్బంది పడుతున్నామని దాన్ని తొలగించాలని ఫిర్యాదు చేస్తే ఒక వారంలోపే ఆ సమస్యను పరిష్కరించి ఈరోజు వారందరికీ ఉత్తర్వులు ఇచ్చామన్నారు. ప్రభుత్వ ఉద్దేశం ఈ రూపంలో సాకారమయిందన్నారు. ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తుందని పరిష్కరించగలిగే ప్రతి సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు

# దశాబ్ద కాలం నాటి సమస్యను ఒక వారంలో పరిష్కరించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

● ధన్యవాదాలు తెలిపిన పెడన ఎమ్మెల్యే కాగిత..లబ్ధిదారులు



**పెడన,మే 22 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా చేపట్టిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక.....మీకోసం కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తుంది. ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించి వారిలో సంతోషాన్ని నింపుతోంది. వివరాల్లోకి వెళితే....... రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల నిర్వహించిన జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్లో ఇకపై ప్రతి శుక్రవారం నియోజకవర్గ కేంద్రాల్లో శాసనసభ్యులతో కలిసి జిల్లా కలెక్టర్లు ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక....మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. ఇందులో భాగంగానే ఈనెల 15 వ తేదీన శుక్రవారం జిల్లాలో తొలిసారిగా పెడన నియోజకవర్గాన్ని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఎంపిక చేసుకుని శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ తో కలిసి మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సమయంలో పెడన మండలంలోని పలువురు ప్రజలు అర్జీలు తీసుకొని వచ్చారని వారంతా తమకు చెందిన 11 ఎకరాల 92 సెంట్లు భూమి మార్కెట్ యార్డ్ వద్ద సమీపంలో ఉందని, సర్వే నంబర్ 261 లో ఉందని ఆ భూమి అంతా 22 -ఏ నిషేధిత భూముల జాబితాలో ఉండడంతో గత 10 సంవత్సరాలుగా తాము రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్న అమ్ముకోవాలన్న చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆ జాబితా నుండి తమ భూమిని తొలగించాలని కోరుతూ అర్జీ అందజేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ వెంటనే విచారించి నిషేధిత జాబితా నుండి తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మచిలీపట్నం ఆర్డీవో సాంబశివరావుకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆర్డీవో అన్ని విధాల విచారించి ఆ భూమిని 22-ఏ నిషేధిత భూముల జాబితా నుండి తొలగిస్తూ ఉత్తర్వులను ఈ శుక్రవారం జిల్లా కలెక్టర్ లబ్ధిదారులకు అందజేశారు. కేవలం ఒక వారంలోనే దశాబ్దాల సమస్యను పరిష్కరించినందుకు పెడన శాసనసభ్యులు జిల్లా కలెక్టర్ ను ఆర్డిఓను రెవిన్యూ యంత్రాంగాన్ని ధన్యవాదాలు తెలిపారు. తమకు పెడన మార్కెట్ యార్డ్ సమీపంలో సర్వేనెంబర్ 261 లో 11 ఎకరాల 92 సెంట్లు భూమి ఉందని, ఆ భూమి 150 కుటుంబాలకు చెందినదని 22-ఏ నిషేధిత భూముల జాబితాలో ఉండటంతో తాము రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నా అమ్ముకోవాలన్న గత 10 సంవత్సరాలుగా చాలా ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు దండుబోయిన లక్ష్మీ తిరుపతమ్మ వరుదు శ్రీనివాస్ అన్నారు. గత శుక్రవారం పెడనలో జరిగిన మీకోసం కార్యక్రమంలో సమస్య పరిష్కరించాలని అర్జీ ఇచ్చామని ఈ శుక్రవారం ఆ సమస్య పరిష్కరించి తమకు ఉత్తర్వులు ఇచ్చారని చాలా సంతోషంగా ఉందన్నారు. దశాబ్దాల సమస్య ఒక వారంలోగా పరిష్కరించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కి జిల్లా కలెక్టర్కు పెడన శాసనసభ్యులకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

# విస్సన్నపేట కోనేరు కాంట్రాక్టు పనులపై సమగ్ర దర్యాప్తు జరగాలి

–ఎన్ డబ్ల్యు సి ఎన్టీఆర్ డిస్టిక్ చైర్మన్ చిగురుకోటి సూర్యతేజ



**విస్సన్నపేట,మే 22 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో ప్రతి బొట్టుకు అధిక పంట అనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా కోనేరు చెరువు అభివృద్ధికి( డబ్ల్యు డి సి పీఎం కేఎస్ వై 2.0 ) 50 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయడం జరిగింది అని నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ చిగురుకోటి సూర్యతేజ మీడియా సమావేశంలో తెలియజేశారు.కోనేరు నుండి ఎటువంటి నీటి చుక్క పంట పొలాలకు వెళ్ళటం లేదని ఆయకట్టు లేదని గ్రామంలోని పలు నివాస ప్రాంతాల డ్రైనేజీల ద్వారా వేస్ట్ వాటర్ కోనేరులో కలవడం జరుగుతుందని ఎటువంటి సురక్షిత నీరు లేదని ప్రధానమంత్రి రైతుల సంక్షేమం కోసం అందించే ఈ పథకం దుర్వినియోగం కాకుండా తక్షణం కాంట్రాక్టు పనులు నిలిపివేయాలని సమగ్ర దర్యాప్తు చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. 8.60 ఎకరాల భూమి కోనేరు పరిధిలో ఉన్నట్లు రెవెన్యూ ఎఫ్ఎంబి చెబుతున్న ప్రస్తుత చెరువు విస్తీర్ణం 7. 26 ఎకరాలుగా అధికారులు తెలియజేస్తున్నారని రిమైనింగ్ భూమి ఏమైందని అదేవిధంగా 50 లక్షల రూపాయలు నిధులు మంజూరు కాగా 37, 09,123 లక్షల అభివృద్ధి పనులకు టెండర్లకు ఆహ్వానించడం తో పాటు మిగిలిన సొమ్ము అభివృద్ధి పనులకు ప్రైవేటు కంపెనీలకు అప్పగిస్తున్నారని ఈ విధమైన చర్య ఏ జీవో ప్రకారం అమలు చేస్తున్నారో తెలియజేయాలని మంజూరైన పూర్తి సొమ్ములో కొంత సొమ్ముకు టెండర్లు పిలవడం మిగిలిన సొమ్ముకు పిలవకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ విషయమై న్యాయపోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బిజెపి నాయకులు గుత్త శివ సుబ్రహ్మణ్యం బాబు సంయుక్తంగా ఎంపీడీవో చిన్న రాట్నాలు కు వినపత్రం అందించారు.

# గోవధ నిషేధం చట్టాల పటిష్ట అమలు..

● అధికారులు సమన్వయంతో పనిచేయండి ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ/రెడ్డి గూడెం,మే 22 (వార్తాప్రభ) :** జిల్లాలో గోవధ నిషేధం, జంతు సంక్షేమ చట్టాలను పటిష్టంగా అమలుచేసేందుకు సమన్వయ శాఖల అధికారులు సమష్టిగా కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శుక్రవారం రెడ్డిగూడెంలో జరిగిన ప్రత్యేక గ్రీవెన్స్, ఒక నెల–ఒక గ్రామం–నాలుగు సందర్శనలు కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవధ నిషేధ చట్టాల అమలులో రెవెన్యూ, పోలీస్, పశుసంవర్ధక తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అక్రమ రవాణా, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బక్రీద్ సందర్భంగా జంతు వధపై చట్టపరంగా చేయదగినవి, చేయకూడని అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఆవులు, దూడలు, ఒంటెల వధ నిషేధమని, చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. లైసెన్సు లేని వధ శాలలో లేదా అనుమతి లేని ప్రదేశాల్లో పశువులను వధించకూడదని.. ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ టు యానిమల్స్ యాక్ట్–1960 లేదా సంబంధిత నియమ నిబంధనలను ఉల్లంఘించకూడదని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. ఎం.హనుమంతరావు, ఆర్డీవో ఎ.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కిషోర వికాసం ప్రత్యేక వేసవి శిబిరం



**పెనుగంచిప్రోలు, మే 22 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండలం లోని అనిగండ్లపాడు గ్రామంలో కిషోర్ వికాసం ప్రత్యేక వేసవి శిబిరాల కార్యక్రమంలో భాగంగా కిషోర్ బాలికలకు మీటింగు ఏర్పాటు చేయడం జరిగినది. ఈ మీటింగ్ లో పిల్లలకు బాల్యవివాహాల గురించి పర్సనల్ హైజిన్ గురించి ఫోక్సు చట్టాల గురించి పొదుపు గురించి వివరించడం జరిగినది.ఈ కార్యక్రమంలో సిడిపిఓ సత్యవాణి, సూపర్వైజర్ రజని, లీగల్ ఆఫీసర్ కిరణ్, అంగన్వాడీ హెల్పర్స్ అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

## కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే యార్లగడ్డ



**తిరుమల/గన్నవరం,మే 22 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు కుటుంబ సమేతంగా శుక్రవారం ఉదయం కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. వీఐపీ బ్రేక్ సమయంలో స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ నిబంధనల ప్రకారం దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలికి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. దర్శనానంతరం యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, అందరిపై ఆ దేవదేవుని ఆశీస్సులు మెండుగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. తనను గెలిపించిన గన్నవరం నియోజకవర్గ ప్రజలకు నిరంతరం సేవ చేసే భాగ్యం కలగాలని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అవసరమైన శక్తిని, దీవెనలను ప్రసాదించాలని స్వామివారిని కోరుకున్నారు.అనంతరం తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు.

## జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం



**పెడన,మే 22 (వార్తాప్రభ) :** ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన యోగ గోడపత్రాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.శుక్రవారం నాడు పెడనలో నిర్వహించిన మీకోసం కార్యక్రమం లో పోస్టర్ ఆవిష్కరించారు.సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ఒక నెల ముందు నుంచే యోగా మాసోత్సవాన్ని గత సంవత్సరంలో లాగా నిర్వహించడం జరుగుతుందన్నారు. యోగా ప్రాముఖ్యతను గుర్తించి ప్రతి ఒక్కరూ భాగస్వాములై ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనీ ఆరోగ్యకరమైన సమాజం నిర్మించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దుటలో అందరూ తమ వంతు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం ఆర్డిఓ సాంబశివరావు డిఎంహెచ్వో డాక్టర్ యుగంధర్ జిల్లా భూగర్భ జల అధికారి బిందు శ్రీ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ సతీష్ ఆర్టీసీ డిఎం పెద్దిరాజు సర్వే భూ రికార్డుల ఏడి లక్ష్మణ బాబు డి ఎల్ పి ఓ రజావుల్లా ఆయుష్ శాఖ డాక్టర్లు వాహిని భాగ్యలక్ష్మి తహసిల్దార్లు ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## భారీ హెల్మెట్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించిన ఎస్ ఐ అర్జునరాజు



**విస్సన్నపేట,మే 22 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో జిల్లా పరిషత్ హై స్కూల్ వద్ద హెల్మెట్ అవగాహన కార్యక్రమాన్ని ఎస్ఐ అర్జునరాజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు సమగ్ర అవగాహన కల్పించారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు దేవాంగ యూత్ ఆర్థిక సహాయం



**పెడన,మే 22 (వార్తాప్రభ) :** దేవాంగ యూత్ సేవా కార్యక్రమాలలో భాగంగా పెడన పట్టణం 23వ వార్డు బ్రహ్మపురం పేటలోని అనరోగ్యంతో బాధపడుతున్న పేరిశెట్టి జ్యోతి కి దేవంగా యూత్ 21022 రూపాయలను ఆర్థిక సహాయం శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా దేవాంగ యూత్ అధ్యక్షులు ఊటుకూరి సుధీర్ మాట్లాడుతూ కష్టాలలో ఉన్న పేద దేవాంగులకు దేవాంగ యూత్ అండగా ఉంటుందని.. ఈ సందర్భంగా తెలిపారు. తమ వద్దకు వచ్చిన అర్జీని దేవాంగ యూత్ సేవా సమితి,దేవాంగ యూత్ పెడన, దేవల మహర్షి అనే వాట్సాప్ గ్రూపులలో విషయాన్ని తెలపక అందులో ఉన్న సభ్యులు స్పందించి వారికి తోచినంత సహాయాన్ని అందించి మా దేవాంగ యూత్ కి సహకరిస్తున్నందుకు ఈ సందర్భంగా వారికి ధన్యవాదాలు తెలిపారు. స్థానికులు మాట్లాడుతూ దేవాంగ యూత్ సేవాసమితి గత 6 సంవత్సరాల నుంచి కష్టాల్లో ఉన్న పేదవారికి అనేక రకాలుగా సేవలు అందించడం అభినందనీయం అని. ఈ సందర్భంగా వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుచ్చల సుబ్రమణ్యం పింజల రవీంద్ర కారుపర్తి రామకృష్ణ ఉట్ల మల్లికార్జున పేరక చంటి తదితరులు పాల్గొన్నారు.

వార్తా ప్రభ
హైదరాబాద్

## చైర్మన్ సరితా తిరుపతమ్మ దంపతులకు యాదవ నేత రమేష్ యాదవ్ సత్కారం.



హైదరాబాద్ , మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి) తెలంగాణ రాష్ట్ర షిప్ ఒ గోట్ కార్పొరేషన్ కు చైర్మన్ గా నూతనంగా నియమింపబడ్డ సరితా తిరుపతయ్య దంపతులను అఖిల భారత యాదవ మహాసభ జాతీయ కార్యదర్శి అయిలబోయిన రమేష్ యాదవ్ బృందం సత్కరించింది. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ సీనియర్ నాయకులు ఆయిలబోయిన ధనరాజ్ యాదవ్,తెలంగాణ రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షులు యాతం పవన్ కుమార్ యాదవ్ , శంషాబాద్ మండల శాఖ నుండి నానవాళ్ళ కుమార్ యాదవ్, బండి శ్రీకాంత్ యాదవ్, పిల్లన గ్రోవిల సంజయ్ యాదవ్, పిల్లన గ్రోవిల జ్ఞానేష్ యాదవ్, పిల్లన గ్రోవిల శ్రీధర్ యాదవ్, బండారి విష్ణు యాదవ్, బాతుకు మహేష్ యాదవ్ లు తదితరులు పాల్గొన్నారు.

## మూడు రోజులుగా పొంగిపొర్లుతున్న డ్రైనేజీ

**పట్టించుకోని అధికారులు.**
**ఆవేదన వ్యక్తం చేసిన భాస్కర్ రెడ్డి.**



**కూకట్‌పల్లి,మే22(వార్తాప్రభ):**ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలోని వివేకానంద నగర్ డివిజన్ సప్తగిరి కాలనీ రోడ్ నెంబర్--2లో గత మూడు రోజులుగా డ్రైనేజీ నీరు పొంగిపొర్లుతూ స్థానిక ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. రోడ్డంతా మురుగు నీటితో నిండిపోవడంతో కాలనీవాసులు దుర్వాసన, దోమల సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు.ప్రధాన రహదారిపై డ్రైనేజీ నీరు చేరడంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పలుమార్లు సంబంధిత అధికారులకు బిజెపి సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి సమాచారం అందించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేయండి

**ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ**





**శేరిలింగంపల్లి,మే 22 (వార్తాప్రభ):** కొంగర కలాన్ కలెక్టరేట్‌లో నిర్వహించిన "ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు.ఈ సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి,ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ,ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు.ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు వంటి పథకాలు అర్హులైన వారికి పారదర్శకంగా అందించాలని తెలిపారు.శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, మహిళల సాధికారత కోసం ఎల్లమ్మబండలో మహిళా పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఫ్లైఓవర్లు, రోడ్ల విస్తరణ పనులు చేపడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ,నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## గుడి - బడి - అమ్మ ఒడి!!




గుడి గడియారం మోగే వేళలో
భక్తి
వెలుగులు చిందెను
బడి గంటల స్వరములో
జ్ఞాన దీపాలు వెలిగెను
అమ్మ ఒడిలో ప్రేమ పరిమళం
పూలవానై జారెను
మూడు లోకాల మాధుర్యమై
మనసున నిండెను
గుడి నేర్పేది నీతి మార్గం,
దైవ భక్తి సారము
బడి అందించేది విద్య వెలుగు
జీవితానికి ఆధారం
గుడి మనసుకు ప్రశాంతి
బడి భవిష్యత్తు బాట
అమ్మ ఒడి సేదతీరే మమతల
మధుర గూటి పాట
మూడు కలిసిన చోటే
నిజమైన స్వర్గ సౌందర్యం
మన సంస్కృతి మూలధనం
మన జీవిత వైభవం
గుడి - బడి - అమ్మ ఒడి
మన భారత గౌరవం
తరతరాలకు
నిలిచే అమూల్యమైన స్ఫూర్తి
సౌరభం

**గడ్డం సంతోష్ రాజ్**
9849555485, గోదావరిఖని

# భాగ్యరెడ్డి వర్మ ఆశయాలు స్ఫూర్తి!!

● సమాజ సేవలకు చిరస్మరణీయ గుర్తింపు ● దళితుల ఆత్మగౌరవానికి వర్మ కృషి ● అంటరానితనం వ్యతిరేక పోరాటం ● ఆది హిందువులుగా గుర్తింపు ● రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి

**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 22 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, భాగ్యరెడ్డి వర్మ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. సమాజంలో అంటరానితనం, కుల వివక్ష, జోగిని-దేవదాసి వ్యవస్థలపై పోరాడిన మహనీయుడిగా వర్మను గుర్తుచేసి, బాల్య వివాహాలు, మద్యపానానికి వ్యతిరేకంగా ఆయన చేసిన ఉద్యమాలను వివరించారు. దళితుల ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు 26 తెలుగు మీడియం పాఠశాలలను స్థాపించి, వారిని 'ఆది హిందువులు'గా గుర్తింపు పొందేలా చేసిన కృషిని మేయర్ ప్రస్తావించారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని సమాజ అభ్యున్నతికి అందరం కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎల్లయ్య, డిప్యూటీ కమిషనర్, కార్పొరేటర్లు, నాయకులు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# యాదవుల అభివృద్ధికి కృషి చేయాలి

**-యాదవ కార్పొరేషన్ చైర్మన్ మారబోయిన రఘునాథ్ యాదవ్‌కు ఘన సన్మానం**



**హైదరాబాద్, మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తెలంగాణ రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మారబోయిన రఘునాథ్ యాదవ్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలుసుకుని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి నడికుడ రఘునాథ్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని యాదవుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేయాలని, యాదవ కార్పొరేషన్‌కు సంబంధించిన అన్ని శాఖలను మరింత బలోపేతం చేయాలని కోరారు.అనంతరం మారబోయిన రఘునాథ్ యాదవ్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మెండే కృష్ణ యాదవ్, మాజీ సర్పంచ్ కావలి కృష్ణ యాదవ్, మేకల రాఘవేందర్ యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ షాద్‌నగర్ మున్సిపాలిటీ టౌన్ అధ్యక్షుడు నక్క బాల్‌రాజ్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు పద్మారం వెంకటేష్ యాదవ్, మాజీ సర్పంచ్ జిల్లా యువత ఉపాధ్యక్షుడు దవ్వాజి శ్రీనివాస్ యాదవ్, నడికుడ సంతోష్ యాదవ్, నడికుడ నరేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్డేపల్లి నర్సింగ్ రావు ఘన నివాళులు అర్పించిన కూకట్ పల్లి నాయకులు.





**కూకట్ పల్లి, మే 22(వార్తాప్రభ):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భూ ఖనిజాభివృద్ధి శాఖ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగరావు 12వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కూకట్‌పల్లి వివేకానంద నగర్ కాలనీలోని వీఎన్ఆర్ సర్కిల్ వద్ద నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో ఆయన కుమారుడు, కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని నర్సింగరావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ స్వర్గీయ నర్సింగరావు ప్రజాసేవకు జీవితాంతం అంకితభావంతో పనిచేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండి సేవలు అందించారని, రాజకీయాల్లో విలువలు,నిబద్ధత, ప్రజల పట్ల ప్రేమతో ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. ఆయన చూపిన సేవా మార్గాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుకు సాగాలని యువతకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల స్థానిక నాయకులు, అభిమానులు, కాలనీవాసులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగరావు కి ఘన నివాళులు అర్పించారు.

# మల్కాజిగిరిలో అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలి

**74వ డివిజనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సమావేశం**

**హైదరాబాద్, మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** దక్షిణ మధ్య రైల్వే, హైదరాబాద్ డివిజన్‌కు చెందిన 74వ డివిజనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సమావేశం సికింద్రాబాద్‌లోని హైదరాబాద్ భవన్‌లో గల డివిజనల్ రైల్వే మేనేజర్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సమావేశానికి హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సంతోష్ కుమార్ వర్మ అధ్యక్షత వహించారు. అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ డి.ఎస్. రామారావు; సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ డా. అనిరుధ్ పమార్, హైదరాబాద్ డివిజన్‌కు చెందిన ఇతర బ్రాంచ్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రస్తుత కమిటీకి ఇది నాలుగవ సమావేశం. నామినేట్ చేయబడిన 18 మంది సభ్యులలో 10 మంది సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో చైర్మన్ 2025-2026 (ఏప్రిల్ 2025 నుండి మార్చి 2026 వరకు) ఏప్రిల్, మే 2026 కాలంలో సాధించిన విజయాలను, అలాగే వివిధ అమృత్ స్టేషన్లలో పనుల స్థితితో సహా హైదరాబాద్ డివిజన్ వ్యాప్తంగా చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యకలాపాలను వివరించారు. ఇది కాకుండా డివిజన్‌లో పూర్తయిన ప్రయాణీకుల సౌకర్యాల పనులు, కొనసాగుతున్న పనుల గురించి కూడా చైర్మన్ సభ్యులకు వివరించారు. డివిజన్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల పట్ల సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ పనులను పూర్తి చేయడానికి, అలాగే అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద ఎంపిక చేసిన స్టేషన్లలో కొనసాగుతున్న పనుల కోసం చేసిన కృషిని వారు అభినందించారు. కొత్త రైళ్లను ప్రవేశపెట్టడం, రైళ్లను ఆపడం, ప్రత్యేక రైళ్లను నడపడం, లిఫ్టులు, ఎస్కలేటర్లు మొదలైన వాటిని ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. వారి సూచనలు, విజ్ఞప్తులను అమలులో ఉన్న మార్గదర్శకాలు, నిబంధనల పరిధిలో పరిశీలించి, తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని చైర్మన్ సభ్యులకు హామీ ఇచ్చారు.మల్కాజిగిరిలో అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని, కొత్తగా నిర్మిస్తున్న రాధాకృష్ణనగర్‌లో ప్లాట్‌ఫాం పొడిగింపు పనులను త్వరగా పూర్తి చేయాలని, రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ను బాసర్‌కు పొడిగించాలని, తిరుపతి కరీంనగర్ ఎక్స్‌ప్రెస్‌ను నిజామాబాద్‌కు పొడిగించాలని, తుంగభద్ర ఎక్స్‌ప్రెస్‌ను డోన్ పొడిగించాలని, బోలారం రైల్వే స్టేషన్‌లో లిఫ్టులు ఏర్పాటు చేయాలని డిఆర్‌యుసిసి సభ్యుడు భరద్వాజ్ కోరారు. నాగావళి ఎక్స్‌ప్రెస్, వైజాగ్ నాందేడ్ ఎక్స్‌ప్రెస్, నరసాపూర్ నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను బోలారం వద్ద ఆపాలని ఆయన అభ్యర్థించారు.



# ప్రభుత్వ నామినేటెడ్ చైర్మెన్లకు
## యాదవ సంఘ జాతీయ నేత రమేష్ సత్కారం.





**హైదరాబాద్, మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తెలంగాణ రాష్ట్ర లైవ్ స్టాక్ కార్పొరేషన్ చైర్మన్ గా నూతనంగా నియమింపబడ్డ చరణ్ కౌశిక్ యాదవ్ ని మరియు రాష్ట్ర యాదవ కార్పొరేషన్ కు వైస్-చైర్మన్ గా నూతనంగా నియమింపబడ్డ గజ్జి భాస్కర్ యాదవ్ లను అఖిల భారత యాదవ మహాసభ జాతీయ కార్యదర్శి అయిన రమేష్ యాదవ్ నేతృత్వంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు.ఈరోజు సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆయిలబోయిన ధనరాజ్ యాదవ్,తెలంగాణ రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షులు యాతం పవన్ కుమార్ యాదవ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బర్ల జగదీష్ యాదవ్, శంషాబాద్ మండల శాఖ నుండి బండి శ్రీకాంత్ యాదవ్, పిల్లనగ్రోవిల నాగేష్ యాదవ్,బాతుకు మహేష్ యాదవ్ లు మరియు ఎల్లపల్లి శ్రీరామ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రతా ప్రమాణాలు పాటించకుండా నిర్మాణాల పట్ల బిజెపి ఆగ్రహం

**- ప్రజా ఆందోళనను దృష్టి లో పెట్టుకోండి**
**- బిజెపి నేత రవికుమార్ యాదవ్**





**శేరిలింగంపల్లి,మే 22 (వార్తాప్రభ):** మియాపూర్ డివిజన్ పరిధిలోని వీడియో కాలనీలో ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా నాలా పనుల పేరుతో భారీ గుంతలు తవ్వడాన్ని భారతీయ జనతా పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు .కమిషన్ల కోసం చేపడుతున్న పనుల వల్ల కాలనీ ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రవికుమార్ యాదవ్ ఆదేశాల మేరకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మియాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్,గుండె గణేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో, బీజేపీ సీనియర్ నాయకుడు సమ్మెట ప్రసాద్‌తో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు.ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా,భద్రతా చర్యలు పాటించకుండా పనులు చేపట్టడం నిర్లక్ష్యమని నాయకులు మండిపడ్డారు.ఈ సమస్యను బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.అధికారులతో చర్చల అనంతరం నాలా పనులను తాత్కాలికంగా నిలిపివేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు,కార్యకర్తలు,స్థానిక కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తలసేమియా చిన్నారుల కోసం రక్తదానం చేయండి



**మల్కాజ్ గిరి : మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**వేసవిలో తలసీమియా చిన్నారుల బాధలు వర్ణనాతీతం వారి జీవితం గాలిలో దీపంలా విలవిలలాడుతోంది. ప్రతి 15 రోజులకు రక్తం ఎక్కించడం తప్పని సరి. రక్త దాతల కోసం తమకు సహాయం చేసే ఆసుపత్రి, వైద్యులకోసం వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తుంటారు. అలాంటి పరిస్థితిలో కామినేని హాస్పిటల్ వారు ఉచితంగా భోజన వసతులు కల్పిస్తూ రక్తం ఎక్కించడం కూడా జరుగుతుంది. అంతేకాకుండా ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు అందించడం జరుగుతుంది. ఈ సేవలను స్వయంగా వీక్షించిన సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ప్రతినిధులు, తుమ్మల విజయకాంత్ సహకారంతో ఆనంద్ బాగ్ రెసిడెన్స్ అసోసియేషన్ భవనంలో ఈనెల 24న ఆదివారం ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు రక్తదాన శిబిరం ను ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి బ్రోచర్ ను ఆవిష్కరించి తలసీమియా చిన్నారుల కోసం రక్తదానం చేసి తలసీమియా జీవితాలకు చేయూత నివ్వాల్సిందిగా విజ్ఞప్తి చేస్తూ కాలనీ వాసులకు కరపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు అడ్వైజర్ రామలింగేశ్వరరావు, కాలని వైస్ ప్రెసిడెంట్ ప్రీతం రామకృష్ణ, తలసేమియా కోఆర్డినేటర్అసోసియేషన్ అడ్వైజర్, రామలింగేశ్వరరావు, అధ్యక్షుడు మురళి కృష్ణ, డాక్టర్ టి సురేందర్, వాలంటీర్స్ తుమ్మల విజయ్ కాంత్, ఆంజనేయులు, పాల్గొన్నారు.

## బాలిక విద్యను ప్రోత్సహించిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ

**జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్**

**మంచిర్యాల, మే 22,** (వార్తా ప్రభ ప్రతినిధి)దళితుల బాలబాలికల విద్యను ప్రోత్సహించిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భాగ్యరెడ్డి వర్మ జయంతి కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంతరెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, సంబంధిత శాఖల అధికారులతో కలిసి హాజరై భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.

# ఎడిటోరియల్

## మోడీ హింట్ ఇచ్చేశారా...
## అవుట్ అయ్యేది ఎవరు ?

కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రధానిగా రెండేళ్ళ పాలన పూర్తి అయింది. మూడవసారి అధికార్మలోకి వచ్చిన తరువాత తొలి రెండేళ్ల పాలన మీద సమగ్రమైన సమీక్ష అయితే తాజాగా జరిగిన మంత్రి వర్గ సమావేశంలో జరిగింది అని అంటున్నారు. ఏకంగా దాదాపుగా అయిదు గంటల పాటు సుదీర్ఘమైన భేటీ జరిగింది అని అంటున్నారు. ఇంతటి కీలకమైన లాంగ్ టెర్మ్ భేటీ అయితే గతంలో ఎపుడూ జరగలేదు, గరిష్టంగా మూడు గంటల పాటు మాత్రమే మంత్రి వర్గ సమావేశాలు గతంలో జరిగాయి. మరి ఇంతటి సుదీర్ఘమైన సమావేశం ద్వారా ఏమి చెప్పారు మంత్రులకు ఏ విధంగా దిశా నిర్దేశం చేశారు అన్నదే ఢిల్లీ సర్కిల్స్ లో ప్రస్తుతం బిగ్ పొలిటికల్ డిబేట్ గా సాగుతోంది. మంత్రుల పనితీరు మారాలని ప్రధాని కోరారని అంటున్నారు. అంతే కాదు ఫైళ్ళ క్లియరెన్స్ విషయంలో వేగం పెరగాలని ఆయన సూచించారు అని అంటున్నారు. అలాగే మంత్రులు తమ పని తీరులో కొత్త దనం చూపించాలని శాఖా పరంగా సంస్కరణలను కూడా కొత్తవి ఆవిష్కరించాలని ప్రధాని సూచించారు అని అంటున్నారు. అలాగే అలసత్వం వద్దని కూడా పేర్కొన్నట్లుగా తెలుస్తోంది. విభేదాలు వద్దు : అదే సమయంలో విభేదాలు వద్దని శాఖాపరంగా అంతా నిబద్ధతో పనిచేయాలని 2047 లక్ష్యాన్ని పెట్టుకుని ఉత్సాహంగా ముందుకు సాగాలని మోడీ కోరారు. పెండింగ్ అన్న మాటే వినిపించకూడదని మోడీ మంత్రులకు స్పష్టం చేసినట్లుగా చెప్పారు. ఈ రోజే అధికారంలోకి వచ్చామన్న హుషార్ తో పనిచేయాలని ఆయన కోరారు శాఖాపరంగా ఎప్పటికప్పుడు అవసరమైన మార్పులు తీసుకుని రావాలని కూడా ఆయన కోరారని అంటున్నారు.ఇదిలా ఉంటే ఈ ఏడాదిలో మోడీ అధ్యక్షతన జరిగిన పూర్తి స్థాయి మంత్రి వర్గ సమావేశం ఇదే అని అంటున్నారు. ఈ సమావేశంలో కేబినెట్ మంత్రులతో పాటు ఇండిపెండెంట్ చార్జితో ఉన్న మంత్రులు సహాయ మంత్రులు మొత్తం 71 మంది దాకా హాజరయ్యారని అంటున్నారు. అందరినీ పిలిచి మరీ మోడీ పనితీరు గురించి వివరించారు అంటే కచ్చితంగా కేంద్ర పెద్దల వద్ద మంత్రుల పనితీరు మీద అంచనాలు ఉన్నాయని అంటున్నారు. ఒక విధంగా హింట్ ఇచ్చారా అన్న చర్చ కూడా సాగుతోంది. పని తీరు మెరుగుపరచుకోఅవలని కోరడం అంటే కొందరికి ఉధ్వాసన తప్పదా అన్న చర్చ కూడా సాగుతోంది. దాంతో ఇన్ ఎవరు అన్నది పక్కన పెడితే ఎవరు అవుట్ అన్న దాని మీదనే పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. జూన్ నెలలో మంత్రి వర్గ విస్తరణ ఉందని చెబుతున్నారు. దాంతో మోడీ మార్క్ పునర్ వ్యవస్థీకరణకు ఈ మీటింగ్ కీలకంగా మారిందని ప్రచారం కిఊడా సాగుతోంది.

## ప్రజల భద్రత ప్రధాన లక్ష్యం, ఔట్ ఫాల్ డ్రైన్స్ వద్ద రీలింగ్స్ త్వరగా పూర్తి చేయండి

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**





**విజయవాడ పశ్చిమ మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజల భద్రత ప్రధాన లక్ష్యంమని కావున ఔట్ ఫాల్ డ్రైన్స్ వద్ద రీలింగ్స్ త్వరగా పూర్తి చేయాలని, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం ఉదయం తన పర్యటనలో భాగంగా అజిత్ సింగ్ నగర్, వేముల శ్యామల దేవి రోడ్డు, భగత్ సింగ్ నగర్ రోడ్డు, వాంబే కాలనీ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణ పరిశీలించారు.అజిత్ సింగ్ నగర్ వద్ద ఉన్న ఔట్ ఫాల్ డ్రైన్ కు రైలింగ్స్ వేసి, బ్యారిగేటింగ్ సరిగ్గా చేయించాలని, నగరంలో ఇప్పటికే ప్రతి ఔట్ ఫాల్ డ్రైన్ వద్ద రైలింగ్ పనులు మొదలు చేసినప్పటికీ, మిగిలినవి కూడా త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ప్రజల భద్రత ప్రధాన లక్ష్యంగా అధికారులు ముందుగా ఈ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జే ఎన్ ఎన్ యు ఆర్ ఏం వద్ద పారిశుద్ధ్య నిర్వహణ పూర్తి స్థాయిలో ఉండాలని, ప్రతి రోజు సైడ్ కాలువలు తీయాలని వ్యర్ధాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, క్రమ తప్పకుండా యాంటీ మలేరియాల్ యాక్టివిటీస్ జరగాలని శాఖాధిపతులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. తదుపరి సింగ్ నగర్లో గల అన్న క్యాంటీన్ పరిశీలించి నోడల్ ఆఫీసర్లు ప్రతిరోజు పరిశీలిస్తూ ఎటువంటి మరమతులున్న వెంటనే పూర్తి చేయాలని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల కూలర్లు, పరదాలు నీటి సరఫరా ఎప్పటికప్పుడు సరిగా ఉన్నాయా లేదా అని చూసుకుంటూ ఉండాలని అన్నారు.ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె. షమ్మీ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపాలకృష్ణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## మిడిమిడి జ్ఞానం ఎవరిదో ప్రజలకు తెలుసు - కామరాజ్ హరీష్ కుమార్

**● రూ.222 కోట్ల హెలికాప్టర్ ఖర్చులంటూ పచ్చి అబద్ధాలు చెప్తున్న నాదెండ్ల మనోహర్ ● పవన్ కళ్యాణ్ గారి పర్యటనలకు విరాళాల సొమ్మో, సొంత సొమ్మో... శ్వేతపత్రం విడుదల చేయగలరా?● మావిగన్' నిరసనలపై కూటమి నేతల్లో వణుకు మొదలైంది ● దీపం-2 పథకం పేరుతో రాష్ట్ర మహిళలను వంచించిన ఘనత మీదే ● డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంలో నాణ్యత కరవైంది.. విద్యార్థుల పొట్ట కొడుతున్నారు ● వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై నాదెండ్ల మనోహర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం ● ముఖ్యమంత్రి పర్యటనల కంటే ప్రజారోగ్యం, భద్రత ముఖ్యం కాదా?**



**విజయవాడ పశ్చిమ మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఒక మాజీ ముఖ్యమంత్రి,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజా సమస్యలపై నిలదీస్తుంటే, సమాధానం చెప్పలేక పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అడ్డగోలు విమర్శలు చేయడం హాస్యాస్పదమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కామరాజ్ హరీష్ కుమార్ తీవ్రంగా మండిపడ్డారు.విజయవాడ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయం నుండి శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటన లో కామరాజ్ హరీష్ కుమార్ మాట్లాడుతూ,అధికారంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి భద్రత,సమయ పాలన, మరియు రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రోటోకాల్ ప్రకారం జరిగే పర్యటనలను వేలెత్తి చూపడం నాదెండ్ల మనోహర్ అజ్ఞానానికి నిదర్శనం.హెలికాప్టర్ల కోసమే రూ.222 కోట్లు ఖర్చు చేశారంటూ ఎలాంటి ఆధారాలు లేకుండా పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారు.మరి ఇవాళ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేస్తున్న పర్యటనలకు సొమ్ము ఎక్కడి నుంచి వస్తుందో నాదెండ్ల గారు చెప్పగలరా? అని ప్రశ్నించారు.అవి పార్టీ నిధులో,విరాళాల సొమ్మో,లేదా మీ వ్యక్తిగత వ్యాపారాల సొమ్మో శ్వేతపత్రం విడుదల చేసే ధైర్యం ఉందా?" అని ప్రశ్నించారు.

**'మావిగన్' నిరసనలకు భయపడుతున్న కూటమి సర్కార్** కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై,వైఫల్యాలపై వైఎస్ జగన్ గారు గళమెత్తితే దాన్ని 'మావిగన్' అంటూ హేళన చేయడం వారి అపరిపక్వతను చూపిస్తోందని హరీష్ కుమార్ ధ్వజమెత్తారు. "ప్రజల్లో వస్తున్న తిరుగుబాటును,నిరసనలను చూసి కూటమి నేతల్లో వణుకు మొదలైందన్నారు.అమరావతి రైతుల గురించి మాట్లాడే నైతిక అర్హత జనసేన లేదా టీడీపీకి లేదని గత ఐదేళ్ల మా పాలనలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి,రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేశాం అని గుర్తు చేశారు.కానీ నేడు కూటమి ప్రభుత్వం కేవలం గ్రాఫిక్స్ చూపిస్తూ కాలయాపన చేస్తోంది" అని విమర్శించారు.

లి దీపం-2 పథకం: కోతలే కానీ లబ్ధి లేదుదీపం-2 పథకం గురించి మంత్రి గారు చెబుతున్న అంకెలు అన్నీ కాగితాలకే పరిమితమని హరీష్ కుమార్ దుయ్యబట్టారు.రాష్ట్రంలో కోట్లాది మంది మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీల్లో చెప్పి,అధికారంలోకి వచ్చాక ఆంక్షల పేరుతో సగానికి పైగా లబ్ధిదారులకు కోత విధించింది నిజం కాదా? అని ప్రశ్నించారు.మొదటి విడతలో 97 లక్షల మందికి ఇచ్చామని చెప్తున్న మంత్రి గారు,ఐదో విడతకు వచ్చేసరికి ఆ సంఖ్య 48 లక్షలకు ఎందుకు పడిపోయిందో సమాధానం చెప్పాలన్నారు.లబ్ధిదారుల సంఖ్య సగానికి పడిపోవడమే మీ పారదర్శకతకు నిదర్శనమా? అని ప్రశ్నించారు.రాయితీ సొమ్ము ఎప్పుడు జమ అవుతుందో తెలియక,అసలు గ్యాస్ ఆఫీసుల చుట్టూ తిరగలేక రాష్ట్ర మహిళలు అల్లాడిపోతున్నారు అని మండిపడ్డారు.

**మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపం.. విద్యార్థుల పొట్ట కొడుతున్నారు** శ్రీమతి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో సూపర్ ఫైన్ క్వాలిటీ రైస్ ఇస్తున్నామన్న మంత్రి మాటల్లో ఏమాత్రం నిజం లేదని హరీష్ కుమార్ స్పష్టం చేశారు.క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు,వసతి గృహాల్లో అందుతున్న భోజనాన్ని ఒకసారి మంత్రి గారు స్వయంగా పరిశీలిస్తే నిజాలు తెలుస్తాయన్నారు.నాసిరకం బియ్యం,కనీస నాణ్యత లేని వంటకాలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.బియ్యం బ్యాగులపై క్యూఆర్ కోడ్‌లు ముద్రించడం కాదు ముఖ్యం విద్యార్థుల కడుపు నిండుతుందా లేదా,వారికి పౌష్టికాహారం అందుతుందా లేదా అన్నది ముఖ్యం.రైతుల త్యాగాలను అడ్డం పెట్టుకుని,నాణ్యమైన భోజనం అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది" అని ఆరోపించారు.

## దోమల వల్ల కలిగే వ్యాధుల నివారణ కొరకు ఫ్రైడే డ్రై డే





**విజయవాడ పశ్చిమ మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**దోమల వల్ల కలిగే వ్యాధుల నుండి నివారణ కొరకు ఫ్రైడే ఫ్రైడే నిర్వాహనతో ప్రజలకు అవగాహన కల్పించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం పాయకపురం పరిసర ప్రాంతాలలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలు దోమల బారిన పడకుండా ఉండేందుకు వీఎంసి సిబ్బంది అవగాహన కల్పించారు. అందులో భాగంగా అక్కడ నివసిస్తున్న ప్రజల వారి ఇళ్లలో ఉన్న నీటి నిల్వలను శుభ్రం చేస్తూ ప్రతి ఫ్రైడే డ్రై డే నిర్వహించాలని, వారికి అవగాహన కల్పిస్తూ దోమలు పెరగకుండా యాంటి లార్వా ఆపరేషన్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సిబ్బంది, ఏ ఎన్ యం లు, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.

## పరమేశ్వర చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మందులు పంపిణీ



**విజయవాడ పశ్చిమ మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరంలో సింగ్ నగర్ లో నివాసం ఉంటున్న 12 సంవత్సరాల (హృతికేష్) బాలుడుకి గత కొన్ని సంవత్సరాలుగా షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. గత కొద్ది నెలలు క్రితం షుగర్ ఎక్కువయి కోమాలోకి వెళ్ళే పరిస్థితి వచ్చింది.వారి తల్లిదండ్రులు పిల్లవాడి (హృతికేష్) వైద్యం నిమిత్తం వారివద్ద ఉన్న మొత్తం ఆస్తి ఆసుపత్రి ఖర్చులకు పోగా ఇంకా చాలక అప్పులు తెచ్చి చికిత్స చేయించడం జరుగుతోంది. ప్రస్తుతానికి వారు ఆర్ధికంగా ఇబ్బంది పడుతూ నెలవారి మందులు కూడా కొనలేని పరిస్థితిలో వారు తెలిసిన వాళ్ల ద్వారా పరమేశ్వర చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు అయిన కందుల పరమేశ్వర రావు ని సంప్రదించి ఆ బాబుకి (హృతికేష్) తగిన సహాయం చేయమని అడగడం జరిగింది.వెంటనే స్పందించిన కందుల పరమేశ్వర రావు, ట్రస్ట్ గౌరవ సభ్యులైన అట్లూరు శ్రీదేవీ, మరియు జడగం శ్రీనివాస్, తో కలసి హృతికేష్ (పేషంట్) ఇంటికెళ్లి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి కనుక్కొని బాలుడు ఆరోగ్య పరిస్థితి ఏమాత్రం బాగోలేదు అని భావించిన కందుల పరమేశ్వర రావు మిగతా ట్రస్ట్ సభ్యులకు కూడా ఈ విషయం తెలియజేసి మనము తక్షణమే పరమేశ్వర చారిటబుల్ ట్రస్ట్ నుంచి మందులు పంపిణీ చేయాలని తెలియజేశారు,ట్రస్ట్ సభ్యులు వెంటనే స్పందించి పరమేశ్వర చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేసే ఏ కార్యక్రమం కైనా కందుల పరమేశ్వర రావు చెప్పిన వెంటనే తమ వంతు పరిపూర్ణమైన ఆర్థిక సహాయ సహకారం అందిస్తామన్నారు.ఈ కార్యక్రమానికి సహాయ సహకారం అందించిన వారు అట్లూరి శ్రీదేవి, అత్తులూరి భార్గవ్, పర్వతనేని శేషు కుమారి, యం నాయక్, షేక్ షబాషి, షేక్ మతీన్, షేక్ సుల్తాన, వహీదా బేగం, తమ్మా సురేష్ రెడ్డి, ఉమ్మా, ఎస్ గిరిబాబు,మెడిసిన్ అందించినవారు అట్లూరి శ్రీదేవి, కందుల పరమేశ్వర రావు, మేట్టపల్లి తులసి, దేగల రామరావు,మొదలగువారు ఈకార్యక్రమం పాల్గొన్నారు.అట్లూరి శ్రీదేవి మాట్లాడుతూ హృతికేష్ కి ఇంత చిన్న వయసులోనే అంత బాధాకరమైన పరిస్థితి రావడం తన్ను ఎంతో బాధిస్తుందన్నారు.

## ప్రయోగాత్మకంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన ఎక్స్ రే వినియోగం

**120 మందికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన ఎక్స్ రే పరీక్షలు**



**విజయవాడ పశ్చిమ మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** క్షయ వ్యాధితో బాధపడుతున్న వారిని గుర్తించాలంటే ఇప్పటి వరకూ రక్తం, కళ్ళే పరీక్షలు జరిపేవారు. కానీ నేడు అన్ని రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చెందిన పరికరాల వినియోగం అందుబాటులో కి వచ్చింది. ఆ క్రమంలోశుక్రవారం ప్రధానమంత్రి టిబి ముక్తిభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా విభాగం అధికారి డాక్టర్ ఆధ్వర్యంలో స్థానిక షేక్ రాజా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కొత్తపేట నందు మొబైల్ హ్యాండ్ హెడ్ ఎక్స్ రే తీయటం జరిగింది. రాబోయే టి బి ని ముందు గానే కనిపెట్టే ఆధునిక ఎక్స్ రే పరికరం ఇది..... ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్టీఆర్ జిల్లా డి సి హెచ్ ఎస్ ఓ మాధవి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కొత్తపేట కొండ ప్రాంత ప్రజలకు ఎక్స్ రే తీయడం జరిగినది 120 మందికి ఈ ఎక్స్ రే లు తీశారు.ఈ కార్యక్రమంలో షేక్ రాజా వైద్య సిబ్బంది మరియు టిబి యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**ఎన్డీఏ కార్యాలయంలో మూడో రోజు ప్రజా దర్బార్ కు విశేష స్పందన**

**కూటమి నేతలతో కలిసి వినతులు స్వీకరించిన కార్యాలయ కార్యదర్శి, ప్రత్తిపాటి శ్రీధర్**



**విజయవాడ పశ్చిమ మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో పశ్చిమ ఎన్డీఏ కార్యాలయంలో గత మూడు రోజులుగా జరుగుతున్న ప్రజా దర్బార్ కు విశేష స్పందన లభిస్తోంది.. శుక్రవారం జరిగిన ప్రజాదర్బార్ లో ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, ఏపీ నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కరణం దివాకర్ బాబు, 37 వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షుడు పోలిశెట్టి శివ, 47 వ డివిజన్ యస్ సీ సెల్ అధ్యక్షుడు చరణ్, జనసేన నాయకుడు పోకల నాగబాబు ప్రజా దర్బార్ లో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.నిత్యం ప్రజల సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని వారు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా సంబంధిత అధికారుల సమన్వయంతో ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు..ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అని కూటమి నేతలు తెలిపారు..సుజనా మిత్రా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు

## ఆప్కాస్ కార్మికులకు తల్లికి వందనం వర్తింపజేయాలి

**ముఖ్యమంత్రి కి ఏఐటియుసి వినతి**



**విజయవాడ పశ్చిమ మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రాష్ట్రంలోని వివిధ రంగాలలో కాంట్రాక్ట్ కార్మికులుగా ఆప్కాస్ సంస్థలో పనిచేస్తున్న వారికి కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా ముఖ్యమంత్రి కి పత్రికాముఖంగా విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఉదయం స్టేట్ గెస్ట్ హౌస్ వద్ద 23వ డివిజన్ పారిశుధ్య కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆప్కాస్ కార్మికులందరికీ కూడా అమ్మ ఒడి పథకం అందించింది అని, కానీ నేటి కూటమి ప్రభుత్వం గత సంవత్సరం ప్రవేశపెట్టిన తల్లికి వందనం పథకం అమలుపరచలేకపోయిందని అన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ శాఖ మంత్రి కి విన్నవించగా అప్కాస్ కార్మికులకు కూడా తల్లికి వందనం అమలు పరచాలని జీవో ఇచ్చారు కానీ పదివేల రూపాయల లోపు జీతం తీసుకుంటున్న వారికి మాత్రమే వర్తింపచేయాలని మెలిక పెట్టారు అన్నారు. కనీస వేతనం 26 వేల రూపాయలకు తగ్గకుండా కార్మికులకు జీతాలు చెల్లించాలని సుప్రీంకోర్టు పేర్కొంటే ఇప్పటివరకు కనీస వేతనం అమలు చేయకపోగా కార్మికులకు రావలసిన ప్రభుత్వ పథకాలను కూడా దూరం చేయటం దుర్మార్గమని అన్నారు. ఇప్పటికైనా ఈ సంవత్సరం అమలు కాబోతున్న తల్లికి వందనం పథకం ఆప్కాస్ కార్మికులందరికీ కూడా వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షులు ఎస్వీఎస్ చలం అధ్యక్షత వహించారు.

## కొండ ప్రాంతంలో పైప్ లైన్ ద్వారా ఇంటికే వంట గ్యాస్

**ఎమ్మెల్యే సుజనా చొరవతో పశ్చిమ లో ప్రణాళికలు రూపొందిస్తున్న అధికారులు..**



**విజయవాడ పశ్చిమ మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో , పశ్చిమ నియోజకవర్గంలోనికొండ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు పైప్‌లైన్ ద్వారా వంట గ్యాస్ అందించేందుకుగెయిల్, మరియు భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు దృష్టి సారించారు .ఎమ్మెల్యే ఆదేశాలతో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, భాగ్యనగర్ గ్యాస్ అధికారులు , సామాజికవేత్త ఆకుల శ్రీనివాసరావు, మున్సిపల్ కార్పొరేషన్ రిటైర్డ్ ఎస్ఈ ఉదయ్ కుమార్ లతో కలిసి శుక్రవారం మల్లికార్జున పేట, ఉప్పర వాగు కొండ ప్రాంతాల్లో పర్యటించి సాధ్యసాధ్యలను పరిశీలించారు..సిలిండర్లు మోసే కష్టాలను తప్పించడానికి, కొండ ప్రాంతాల్లో రోడ్డు సౌకర్యం తక్కువగా ఉన్న చోట్ల, ప్రతి ఇంటికి పైప్‌లైన్ ద్వారా గ్యాస్ కనెక్షన్ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీనివల్ల గ్యాస్ సిలిండర్లను మోసుకెళ్లే ఇబ్బందులు తప్పుతాయి కొండ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటమే కాకుండా, పర్యావరణానికి కూడా మేలు జరుగుతుంది.ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రత్యేక చొరవతో చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం కొండప్రాంత ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని, వారి వంట గ్యాస్ కష్టాలకు త్వరలోనే స్వస్తి పలకబోతున్నామని అధికారులు ధీమా వ్యక్తం చేశారు.

## బహిరంగ జంతువధ,గో వధ పై ముందస్తు చర్యలు తీసుకోండి



**విజయవాడ పశ్చిమ మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విశ్వ హిందూ పరిషత్ విజయవాడ భాధ్యులు మహానగరంలో గోవధ నియంత్రణ కోసం ముందస్తు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. బక్రీద్ సందర్భంగా గోమాతలను అక్రమంగా నిర్మానుష్య ప్రదేశాలలో నిర్బంధించకుండా,అనుమతి లేకుండా రోడ్లపైన, బహిరంగ ప్రదేశాలలో గోవులను వధించుటను నిరోధించి అట్టివారిపై చట్టరీత్య కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆ వినతిపత్రం లో పేర్కొన్నారు. హిందువులు దేవతగా పూజించే గోమాతకు చట్టపరంగా ఉన్న రక్షణను సక్రమంగా వర్తింపజేయాలని అన్ని పోలీస్ స్టేషన్ల వారీగా సూచనలు ఇచ్చి అన్ని పోలీస్ స్టేషన్లను మరియు వి ఎమ్ సీ పరిధిలో మైకుల ద్వారా ప్రచారం చేసి అక్రమ నిర్బంధాలను గుర్తించి నిర్మూలించాలని, గో రక్షా చట్టం 2001, 2009 లను పరిపూర్ణంగా అమలు చేయాలని విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ని కలిసి మెమోరాండం అందించారు. ఈ కార్యక్రమములో విశ్వ హిందూ పరిషత్ విజయవాడ మహానగర్ కార్యదర్శి పొట్టి శ్రీహరి, సహకార్యదర్శి కొంపెల్లి శ్రీనివాస్, భవానిపురం ప్రఖండ కార్యదర్శి హరికిషన్ పాల్గొన్నారు.

# విగ్రహం పేరుతో స్థల కబ్జా.. ఇంచార్జ్ బండారు నానిపై మహిళ తీవ్ర ఆరోపణలు...

**కుల బహిష్కరణను ఎదుర్కొంటున్న బాధితులు.**



**మచిలీపట్నం మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మచిలీపట్నం బలరాముని పేట ప్రాంతంలో విగ్రహం ఏర్పాటు పేరుతో తన స్థలాన్ని కబ్జా చేశారని దేవరపల్లి రాణి అనే మహిళ స్థానిక ఇంచార్జ్ బండారు నానిపై తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ వ్యవహారంలో తమ కుటుంబాన్ని మానసికంగా, సామాజికంగా వేధింపులకు గురిచేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. కులం నుండి బహిష్కరించామంటూ పదేపదే వేధిస్తున్నారని ధ్వజమెత్తింది. మహిళ తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీపట్నం బలరామునిపేట ఐదు రోడ్ల సెంటర్ ప్రాంతంలో నివాసముంటున్న దేవరపల్లి రాణి కి తరతరాల నుండి వారసత్వంగా వస్తున్న ఆస్తిని అదే ప్రాంతానికి చెందిన తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బండారు నాని కబ్జా చేయాలని చూస్తున్నాడని ఆరోపించింది. తమ కుటుంబం పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడి ఎటువంటి అనుమతులు లేకుండా తమ స్థలంలో విగ్రహం ఏర్పాటు చేసాడని ఆరోపించింది. అంతటితో ఆగకుండా తమ ఇంటి పరిసరాల్లో మహిళల గోప్యతను



పట్టించుకోకుండా స్నానాల గదుల వైపు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారని, దీంతో తమ కుటుంబ సభ్యులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఆరోపించింది. పైగా నేర చరిత్ర కలిగిన వ్యక్తులను విగ్రహం వద్ద ఉంచి తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని బండారు నానిపై మండిపడింది. రాత్రి సమయంలో గంజాయి బ్యాచ్ ఆగడాలు తట్టుకోలేకపోతున్నామని మహిళ తెలిపింది. కేవలం స్థల వివాదంతో ఆగకుండా, తమకు కనీస అవసరమైన తాగునీటి సదుపాయాలను కూడా ధ్వంసం చేశారని మహిళ వాపోయింది. ఇంటికి వచ్చే మంచినీటి కుళాయిలను పగలగొట్టడమే కాకుండా, మురుగునీరు బయటకు వెళ్లే పైప్‌లైన్‌ను కూడా ధ్వంసం చేశారని తెలిపింది. తమ ఇంటి గుమ్మానికి ఎదురుగా గోడ నిర్మించి రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆరోపించింది. ఈ సమస్యపై ఇప్పటికే ఎస్ఐ స్థాయి నుంచి ఎస్పీ స్థాయి అధికారులకు వరకు, రాజకీయ నాయకులు మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, కొనకళ్ళ జగన్నాధ రావు( బుల్లయ్యా) ను కలిసినా ఎవరూ కనీసం పట్టించుకోలేదని, ఘటన స్థలాన్ని సందర్శించి పూర్తిస్థాయిలో విచారణ కూడా చేపట్టలేదని మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. న్యాయం కోసం చివరకు కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపింది. కేసును విచారించిన కోర్టు సంబంధిత అధికారులను వివరణ కోరగా, విగ్రహం ఏర్పాటు కోసం ఎటువంటి అధికారిక అనుమతులు మంజూరు చేయలేదని నగరపాలక కమిషనర్ కోర్టుకు వ్రాతపూర్వకంగా సమర్పించినట్లు మహిళ తెలిపింది. ఈ వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు స్టే ఆర్డర్ జారీ చేసినట్లు మహిళ పేర్కొంది. అయినప్పటికీ కేసును వెనక్కి తీసుకోవాలని బండారు నాని తమను బెదిరిస్తున్నారని ఆరోపించింది. ఇప్పటికైనా జిల్లా అధికారులు, పోలీసు శాఖ స్పందించి తమ కుటుంబానికి రక్షణ కల్పించి న్యాయం చేయాలని దేవరపల్లి రాణి వేడుకుంది. కాగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కృష్ణా జిల్లా ఎస్పీని ఈ కేసులో విగ్రహ పీఠం నిర్మాణానికి బాధ్యులెవరో గుర్తించి దర్యాప్తు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణ తేదీకి ముందు పూర్తి నివేదిక సమర్పించాలని తెలిపింది. అలాగే ఇప్పటికే ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు అమలులో ఉండేలా, శాంతిభద్రతలు కాపాడేలా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది.

## వృద్ధ మహిళను కుటుంబ సభ్యులకు అప్పగింత.



**మచిలీపట్నం మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఏపీసిఓపిఎస్ యాప్ సాయంతో వృద్ధ మహిళను కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించి ఇనుగుదురుపేట పోలీసులు మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ప్రజల భద్రత ,శాంతి భద్రతల పరిరక్షణకు ప్రధాన ప్రాధాన్యతనిస్తూ 24 గంటలూ అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్న ఇనగుదురు పోలీసులు మరోసారి తమ మానవత్వాన్ని ప్రదర్శించారు. ఈ నెల 21 వ తేదీ అర్ధరాత్రి సమయంలో నగరంలోని రాజుపేట రామాలయం సమీపంలో ఒక వృద్ధ మహిళ ఒంటరిగా కూర్చొని ఉన్నట్లు 112 కి కాల్ ద్వారా సమాచారం అందింది. సమాచారం అందుకున్న వెంటనే ఇనగుదురు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆమెను పరామర్శించారు. సదరు వృద్ధ మహిళ తీవ్ర ఆందోళనలో ఉండటంతో తన పూర్తి చిరునామా వివరాలు తెలియజేయలేని పరిస్థితిలో ఉంది. కేవలం తన పేరు మాత్రమే వెల్లడించింది. అందిన సమాచారం ఆధారంగా పోలీసులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ఏపీ సి ఓ పి ఎస్ యాప్ సాయంతో ఆమె కుటుంబ సభ్యుల వివరాలను గుర్తించారు. అనంతరం వృద్ధ మహిళను సురక్షితంగా ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆ వృద్ధ మహిళలకు ఎలాంటి హాని జరగకుండా క్షేమంగా ఆమెను ఇనుగుదురుపేట పోలీసులు అప్పగించడంతో వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. అర్ధరాత్రి సమయంలో కూడా వెంటనే స్పందించి మానవత్వంతో వ్యవహరించిన ఇనగుదురు పేట పోలీసుల సేవలను స్థానిక ప్రజలు కొనియాడారు.

## రాష్ట్రంలోని టిడ్కో కాలనీలకు రోల్ మోడల్‌గా ఆత్మకూరు రామాలయం

**● ప్రత్యేక ఆకర్షణగా 27 నక్షత్రాల మొక్కలతో నక్షత్ర వనం ఏర్పాటు ● ఆత్మకూరు టిడ్కో కాలనీలో రామాలయ నిర్మాణాన్ని పరిశీలన ● శ్రీవాణి భజన మందిరాల్లో మొట్టమొదటి ఆలయం ఆత్మకూరు రామాలయం ● రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**



**ఆత్మకూరు మే 22 : (వార్తాప్రభ)** రాష్ట్రంలోని టిడ్కో కాలనీలకు రోల్ మోడల్‌గా ఆత్మకూరు టిడ్కో కాలనీలో నిర్మాణంలో ఉన్న రామాలయం నిలుస్తోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం ఆత్మకూరు పట్టణం టిడ్కో కాలనీలో నిర్మిస్తున్న శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయాన్ని అధికారులు స్థానిక నేతలతో కలిసి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ శ్రీవాణి భజన మందిరాల్లో రాష్ట్రంలోని మొట్టమొదటి ఆలయంగా నిర్మాణం పూర్తి కావస్తున్న ఆత్మకూరు టిడ్కో కాలనీలోని రామాలయాన్ని త్వరలోనే రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణచే ప్రారంభిస్తామని ఆలయ నిర్మాణం తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను కూడా మంత్రి నారాయణ ఆధ్వర్యంలో శ్రీకారం చూడుతున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఐదువేలకు పైగా శ్రీవాణి భజన మందిరాలు ప్రతిపాదించగా వెయ్యికి పైగా ఆలయాలకు నిధులు మంజూరు చేసి పనులు మొదలు పెట్టినట్లు చెప్పారు. 10 లక్షలు నుంచి 40 లక్షల వరకు ఈ పథకం ద్వారా నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఆత్మకూరులో రూ. 40 లక్షల వ్యయంతో రామాలయ నిర్మాణాన్ని మంజూరు చేయగా, ప్రస్తుతం ఆలయ నిర్మాణ పనులు 80 శాతం మేర పూర్తయినట్లు చెప్పారు. రామాలయ ప్రాంగణంలో 27 నక్షత్రాలకు సంబంధించిన పవిత్ర మొక్కలతో ప్రత్యేకంగా "నక్షత్రవనం" ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. పురాణాల గొప్పతనాన్ని భవిష్యత్ తరాలకు అందించేందుకు ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆలయ ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక శోభతో ప్రశాంత వాతావరణంతో తీర్చిదిద్దుతూ ప్రతి భక్తుడు ఆహ్లాదకర అనుభూతి పొందేలా అభివృద్ధి చేస్తున్నారు. ఆత్మకూరు నమూనాను ఆదర్శంగా తీసుకొని రాష్ట్రవ్యాప్తంగా టిడ్కో కాలనీల్లో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రామాలయాల నిర్మాణానికి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. పేదలు నివసించే టిడ్కో కాలనీల్లో ఆధ్యాత్మిక వాతావరణం కల్పించాలనే సంకల్పంతో రాష్ట్రవ్యాప్తంగా భక్తుల ఆకాంక్షల మేరకు ఆలయాల మంజూరుకు చర్యలు చేపట్టినట్లు గుర్తు చేశారు. హిందూ ధర్మ వైభవం సనాతన ధర్మ ఆచార వ్యవహారాలను పరిరక్షిస్తూ ప్రతి ఒక్కరిలో భక్తి భావం, ధార్మిక చింతన పెంపొందించడమే లక్ష్యంగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయాల అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు మంత్రి ఆనంరామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## చేజర్ల ఎస్టీ కాలనీలో కిశోరి వికాసం కార్యక్రమం



**చేజర్ల మే 22 (వార్తాప్రభ)** కిషోరీ వికాసంలో భాగంగా మండల కేంద్రంలోని చేజర్ల ఎస్టీ కాలనీ నందు కిషోరీ వికాసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఆర్థిక నిర్వహణలో భాగంగా కిశోరి బాలికలను తల్లులను సమావేశ పరిచి వారికి ఆర్థికంగా ఏవిధంగా మనం డబ్బు ఆదా చేయాలో అనవసరమైన ఖర్చులను తగ్గించుకొని ప్రతి ఒక్కరు కూడా అవసరమైన ఖర్చులను మాత్రమే చేస్తూ డబ్బు పొదుపు చేస్తూ అవసరమైన ప్పుడు డబ్బులు వాడుకునేలా ఆలోచించి క్రెడిట్ కార్డులు అప్పులు చేయడం లాంటివి తగ్గించుకొని కుటుంబానికి ఆర్థికంగా సహాయ పడగలరని కిశోరీ బాలికలందరికి తెలియజేసారు. ఇంకా రక్తహీనత మరియు పరిశుభ్రత హెల్ప్ లైన్ నెంబర్లు 181 మరియు 1098 గురించి బాల్యవివాహాలు గురించి తెలియజేస్తూ 18 సంవత్సరాలు నిండే వరకు ఎవరూ కూడా వివాహం చేసుకోకూడదని అలా చేసుకున్న ఎడల చట్టరీత్యా నేరము కనుక కిశోరీ బాలికలు ఎవ్వరూ కూడా బడి కాలేజీలు మానివేయకుండా చదువులు పూర్తి చేసుకుని ఏదో ఒక ఉద్యోగం చేసుకుని ఆర్థికంగా బాగా ఎదగాలని బాలికలకు తల్లులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేజర్ల సెక్టార్ సూపర్వైజర్ ఎం.పద్మ అంగన్వాడి ఆయాలు పాల్గొన్నారు.

## స్వచ్ఛ భారత్ అమలులో శాఖల సమన్వయంతో ఉత్తమ ఫలితాలు సాధించాలి- సీఈఓ పి. జగదాంబ






**ఏలూరు, మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి) :** ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ కార్యక్రమాల అమలులో పంచాయతీరాజ్ శాఖ, వ్యవసాయ శాఖలు సమన్వయంతో పనిచేసి మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ప్రిన్సిపాల్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి పి. జగదాంబ పేర్కొన్నారు. జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో ఈ నెల 21న ప్రారంభమైన డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల వ్యవసాయ శాఖ అధికారుల రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో అర్హులైన ప్రతి కుటుంబానికి వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేసి, నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజల్లో మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన పెంపొందించి, బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాల సాధనకు అధికారులు కృషి చేయాలని కోరారు. గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, గృహాల నుంచి సేకరించిన తడి వ్యర్థాలతో వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని తెలిపారు. పొడి వ్యర్థాల విక్రయాల ద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చి ఆర్థికంగా బలోపేతం చేయాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులకు సూచించారు. ద్రవ వ్యర్థాల నిర్వహణలో భాగంగా ప్రతి ఇంటి వద్దే తడి వ్యర్థాలతో కంపోస్ట్ తయారీ, పెరటి తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. దీనివల్ల ప్రజలు సేంద్రీయ ఎరువులతో ఆరోగ్యకరమైన ఆకుకూరలు, కూరగాయలు సాగు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగ నిర్మూలనకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన గ్రామాల నిర్మాణానికి కృషి చేయాలని జగదాంబ కోరారు. పూర్వపు పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని 48 మండలాల నుంచి డిప్యూటీ ఎంపీడీఓలు, వ్యవసాయ శాఖ అధికారులు శిక్షణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా వట్లూరు గ్రామపంచాయతీని సందర్శించి, వ్యర్థ జలాల వినియోగంతో పెరటి తోటల పెంపకాన్ని అధికారులు పరిశీలించారు. జిల్లా ట్రైనింగ్ మేనేజర్ గుర్రాల ప్రసంగి రాజు శిక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షించగా, రిసోర్స్ పర్సన్స్ జీడి శ్రీనివాసరావు, వై యు ఎం సూర్య కుమార్, వట్లూరు పంచాయతీ అభివృద్ధి అధికారి మేక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డిగూడెంలో ఘనంగా బడి పిలుస్తుంది కార్యక్రమం



**రెడ్డిగూడెం మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రభుత్వం వారు చేపట్టిన బడి పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా ఈరోజు రెడ్డిగూడెం లో బడి బయట ఉన్న విద్యార్థులను, మరియు ప్రైవేట్ పాఠశాల నందు చదువుతున్న విద్యార్థులను స్థానిక జెడ్పిహెచ్ఎస్ రెడ్డిగూడెం మరియు మోడల్ ప్రైమరీ పాఠశాలలో చేర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా హాజరయ్యి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరికల నిమిత్తం ప్రయాసపడ్డ ప్రతి ఒక్కరిని అభినందించారు . ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిని మాట్లాడుతూ నాణ్యమైన విద్య కోసం ప్రైవేట్ మరియు బడుబయట పిల్లలు ను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే దిశగా ప్రతి ఒక్కరు కష్టపడాలని, ప్రభుత్వ పాఠశాలల ఫలితాలను, మరియు ప్రభుత్వం వారు పిల్లలకు అందిస్తున్న సేవలను తల్లిదండ్రులకు వివరించారు . ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి 1,2 మరియు రెడ్డిగూడెం కాంప్లెక్స్ చైర్మన్ మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, యంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు .

## బడిపిలుస్తోంది.. భవిష్యత్తుకు బాటలు వేస్తోంది..

**- ఇంటింటికీ విద్యా వెలుగులను తీసుకొస్తున్న కార్యక్రమం**
**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**




**రెడ్డిగూడెం మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రతి చిన్నారి బడిబాట పట్టి విద్యను అందుకొని ఉన్నత భవిష్యత్తు సాధించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన "బడిపిలుస్తోంది" కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శుక్రవారం రెడ్డిగూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన బడి పిలుస్తోంది కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. బడిలో చేరిన చిన్నారులతో ముచ్చటించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల వయసు గల ప్రతి బాలబాలిక బడిలో చేరేలా అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్థాయిలోని సిబ్బంది సమన్వయంతో ప్రత్యేక చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యతను వివరించి, పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలకు పంపేలా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు తదితర సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. విద్య ద్వారా కుటుంబంలో వెలుగులు నింపడమే "బడిపిలుస్తోంది" కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగాల పేరుతో మహిళలతో అక్రమ సంబంధాలు??

**లెక్చరర్ భర్తకు దేహశుద్ధి చేసిన భార్య.**



**మచిలీపట్నం మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కృష్ణా జిల్లా బందరు ప్రాంతంలో నివాసం ఉంటున్న ఓ ప్రైవేటు కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకుడు జాషువాపై అతని భార్య తీవ్ర ఆరోపణలు చేసింది. అవనిగడ్డ ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న జాషువా, విద్యార్థులకు మహిళలకు, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మాయ మాటలు చెప్పిలోబరుచుకుంటున్నాడని భార్య ఆరోపించింది. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తడంతో దాంపత్య జీవితానికి దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో కెమిస్ట్రీ లెక్చరర్ గా పనిచేస్తున్న జాషువా బందరు ప్రాంతంలో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. మహిళలకు ఉద్యోగం ఇప్పిస్తానని ఆశ చూపించి తన ఇంటికి తీసుకు వెళ్లి లోబరుచుకుంటున్నాడని గ్రహించిన భార్య జాషువా వ్యవహారంపై నిఘా పెట్టింది. భర్త కదలికలను గ్రహించిన భార్య అక్రమ సంబంధం పెట్టుకున్న మహిళలతో రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుంది. అక్కడే భర్తకు దేహ శుద్ధి చేసింది. భర్తపై భార్య అనేక ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశమైంది. ఉద్యోగాల పేరుతో పలువురు మహిళలను మోసం చేస్తున్నాడని, తనను కూడా మానసికంగా వేధిస్తున్నాడని భార్య ఆరోపించింది. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసింది. అయితే భార్య చేసిన ఆరోపణలపై పోలీసులు పూర్తి విచారణ చేపట్టనున్నారు.

## వెంకన్న దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు సంసిద్ధం...



**గుడ్లవల్లేరు: మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలోని భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారిని శనివారం దర్శించుకోనున్న భక్తకోటికి శుక్రవారం విస్తతంగా ఏర్పాట్లను సంసిద్ధం చేస్తున్నారు. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి జరిగే ప్రత్యేక పూజలు, విశేషాభిసేకాలను నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు కె.బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే వేలాది భక్తులు విచ్చేస్తున్న ఈ ఆలయంలో మండు వేసవిలో భక్తులెవరూ ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు చలువ పందిళ్లతో పాటు మంచినీరు, అన్నసమారాధన ఏర్పాట్లను బాపిరెడ్డి, భాస్కరమ్మ దంపతులు పర్యవేక్షిస్తున్నారు.

## పీటర్సన్‌కు జిల్లా ద్వితీయం...



**గుడ్లవల్లేరు: మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాలతో గుడివాడ ఎన్.టి.ఆర్ స్టేడియంలో బుధ, గురు వారాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన కష్ణా జిల్లా 'శాప్' లీగ్స్‌లో భాగంగా 600 మీటర్ల పరుగు పందెంలో గుడ్లవల్లేరు ఎ.ఎ.ఎన్.ఎమ్ అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ ఇం.మీ స్కూల్ 10వ తరగతి విద్యార్థి వి.పీటర్సన్ జిల్లా స్థాయి ద్వితీయ స్థానం సాధించాడు. ఈ విషయాన్ని ఆ పాఠశాల డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి శుక్రవారం విలేకరులకు తెలిపారు. కష్ణాజిల్లా క్రీడాభివద్ధి అధికారిణి వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో అండర్ 14 బాలుర కేటగిరీలో 600 మీటర్ల పరుగు అంశంలో పీటర్సన్‌ను, శిక్షణ ఇచ్చిన భూపాల్ రెడ్డిని మండల విద్యా శాఖాధికారులు సత్యనారాయణ, గోపాల్‌రావు, స్కూల్ యాజమాన్యం, డైరెక్టర్, ప్రిన్సిపాల్, స్టాఫ్ అభినందించారు.

## కొండపల్లిలో ఆపరేషన్ క్లీన్ స్వీప్

**పారిశుధ్యం స్వయంగా పర్యవేక్షిస్తున్న మున్సిపల్ చైర్మన్**





**ఇబ్రహీంపట్నం, మే 22 (వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి పురపాలక సంఘం ఆధ్వర్యంలో కొండపల్లి శాంతి నగర్, తూర్పు ఇబ్రహీంపట్నంలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాలను శుక్రవారం ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, 13వ వార్డు కౌన్సిలర్ చనమోలు నారాయణ పనులను ప్రారంభించి పర్యవేక్షించారు. పారిశుధ్య కార్మికులు వార్డుల్లోని ప్రధాన రహదారులు, అంతర్గత రహదారుల్లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు, పిచ్చి మొక్కలను తొలగించారు. మురుగు కాలువల్లో పూడికలు తీసి శుభ్రం చేశారు. సేకరించిన చెత్తను ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్ కు తరలించారు. 36 రోజుల పాటు ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు.

# కొండపల్లి కౌన్సిల్ అత్యవసర సమావేశం నేడు




**ఇబ్రహీంపట్నం, మే 22 (వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి పురపాలక సంఘం కార్యాలయంలో ఈ నెల 23వ తేదీ ఉదయం 11:00 గంటలకు కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కొండపల్లి పట్టణ పరిధిలో ఉన్న 29 వార్డులను 40 వార్డులుగా పునర్విభజన చేపట్టి రూపొందించిన ముసాయిదాపై కౌన్సిల్ ఆమోదం పొందేందుకు ఈ కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశానికి కౌన్సిలర్లు తప్పక హాజరు కావాలని కోరారు.

# సెక్రటేరియట్ ముందు వడ్లు పోసి కవిత నిరసన

**రెండున్నరేళ్లుగా వ్యవసాయశాఖపై రివ్యూ చేయని సీఎం**

**రైతులకు అన్యాయం చేస్తున్న కర్కోటక ప్రభుత్వం**

**తక్షణమే ప్రభుత్వం స్పందించాలి. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు**

**ప్రభుత్వానికి టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరిక**

**సచివాలయం వద్ద ధర్నా, అరెస్ట్ చేసిన పోలీసులు**



హైదరాబాద్: మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)రైతుల బాధలను చూసి చలించిన తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత సెక్రటేరియట్ ముందు వడ్లు పోసి నిరసన తెలిపారు. శుక్రవారం ఉదయం సెక్రటేరియట్ ప్రధాన ద్వారం ముందు కవిత వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు, మహిళలు, తెలంగాణ రక్షణ సేన కార్యకర్తలతో కలిసి వరికంకులు, ప్ల కార్డులతో రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బస్తాల్లో తీసుకు వచ్చిన వడ్లను కొందరు రైతులు సెక్రటేరియట్ ముందు పోసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ...రెండున్నరేళ్లుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ శాఖపై సమీక్ష చేయకపోవడం దారుణమన్నారు. ధాన్యం, ముక్కలు, జొన్నలు, పొద్దు తిరుగుడు పంటలు కొనక పోవటంతో రైతులు ఆవేదనతో ఉన్నారన్నారు. తేమ శాతం ఎక్కువ ఉందంటూ ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారని, తరుగు పేరిట మోసం చేస్తున్న పట్టించుకునే వారు లేరని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. 45-46 డిగ్రీల టెంపరేచర్ లోనూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు... కొనుగోలు కేంద్రాల్లో కనీసం తాగడాని నీళ్ళు లేవు..టెంట్ లు కూడా వేయలేదని కవిత ప్రభుత్వ నిరక్ష్యంపై మంది పడ్డారు. వడ దెబ్బకు గురై కొందరు చనిపోయారు...పంటలను కొనే వారు లేక, అప్పులు తీరే దారి కనిపించక మరికొందరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులు చనిపోతున్నారన్నారు. రైతులు బాధలను చూసే... ఈ ప్రభుత్వానికి బుద్ధి రావాలని, రైతులకు మేలు చేయాలని సచివాలయం వద్ద ధర్నా చేస్తున్నామని కవిత చెప్పారు. రైతుల దుఖం మామూలుగా లేదు. ధాన్యం కొనుగోలు చేయకపోగా తరుగు తీస్తున్నారనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం వడ్లు, జొన్నలు, పొద్దు తిరుగుడు పంట కొనటం లేదన్నారు.

వెంటనే పంట ఉత్పత్తులను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కవితతో సహా రైతులు, మహిళలు, టిఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. కవితను పలక్ నుమా పోలీస్ స్టేషన్ తరలించగా మిగతావారిని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా పోలీసుల తీరుపై మహిళలు, రైతులు నిరసన తెలిపారు.

**ఇది కర్కోటక ప్రభుత్వం** రాష్ట్ర వ్యాప్తంగా రైతులు వరి కుప్పలపై చనిపోతుంటే ఈ ప్రభుత్వం ఏం చేస్తోందని కవిత ప్రశ్నించారు. పలక్ నుమా పోలీస్ స్టేషన్ నుంచి బయటికి వచ్చిన తరవాత కవిత మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో రైతుల దుఖం మామూలుగా లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లాల్లో కలెక్టర్లు రైతులకు అన్యాయం చేస్తున్నారు. గ్రేడ్ ఏ వరిని గ్రేడ్ బి గా రిజిస్టర్ చేస్తున్నారు. సన్న బియ్యానికి ఇచ్చే బోనస్ ఎగ్గొట్టేందుకే డ్రామాలు చేస్తున్నారు. యూరియాకు కూడా ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. వాళ్లు తెచ్చిన యాప్ ఎవరికీ అర్థం కావటం లేదన్నారు మండుటెండలో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు పడుతుంటే వారికి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదన్నారు. అత్యంత కర్కోటక, అమానవీయ ప్రభుత్వం ఇది అంటూ కవిత మండిపడ్డారు. కనీసం రైతులు పండించిన పంటను కూడా కొనుగోలు చేయలేని చేతగాని దద్దమ్మ సర్కార్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వానికి బుద్ధి రావాలనే తాము సచివాలయం ఎదుట వడ్లు పోసి నిరసన తెలిపామని చెప్పారు. ధాన్యం కొనుగోలు చేయకపోగా తరుగు పేరుతో రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నైనా ప్రభుత్వం బుద్ధి తెచ్చుకోని రైతుల సమస్యలను పట్టించుకోవాలన్నారు.

# కల్పతరువు చదువు



చదువుకున్న వ్యక్తులు
దేశానికి శక్తులు
అభివృద్ధికి బాటలు
పటిష్టమైన కోటలు
అందరూ చదవాలి
జీవితాన ఎదగాలి
అజ్ఞానం తొలగాలి
విజ్ఞానం పెరగాలి
చదువెంతో గొప్పది
చదుకుంటే మంచిది
మేధస్సు పెరిగితే
మహిలోన విజేతే
చదువుకున్న వారే!
లోకానికి వెలుగులు
వారికి సాటి లేరే!
గౌరవానికర్హులు
కామధేనువు చదువు
మేలులెన్నో కలవు
చదువుతోనే ప్రగతి
లేకుంటే అధోగతి

**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# స్వచ్ఛత సందేశంతో ఎన్‌టీపీసీ ప్రభాత్ ఫెరీ!!

● టౌన్‌షిప్‌లో మార్మోగిన స్వచ్ఛత నినాదాలు ● ప్లకార్డులు, నినాదాలతో పరిశుభ్రతపై చైతన్యం ● పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత ● ఈడీ చందన్ కుమార్ సమంతా ● దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖి సమంత





**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 22 (వార్తాప్రభ ప్రతినిధి)** ఎన్‌టీపీసీలో స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా టౌన్‌షిప్‌లో నిర్వహించిన ప్రభాత్ ఫెరీ పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించింది. ఈ కార్యక్రమాన్ని ఈడీ చందన్ కుమార్ సమంతా, దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖీ సమంతా ప్రారంభించారు. వారి సమక్షంలో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై సంస్థ నిబద్ధత స్పష్టమైంది. ప్రభాత్ ఫెరీలో జనరల్ మేనేజర్లు, డీఎంఎస్ సభ్యులు, పెద్ద సంఖ్యలో ఎన్‌టీపీసీ ఉద్యోగులు పాల్గొన్నారు. పరిశుభ్రతకు సంబంధించిన నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శిస్తూ టౌన్‌షిప్‌లో అవగాహన కల్పించారు. ప్రత్యేక ఆకర్షణగా గర్ల్ ఎంపవర్‌మెంట్ మిషన్ బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారి క్రమశిక్షణ, చైతన్యం ర్యాలీకి మరింత ప్రత్యేకత తీసుకొచ్చాయి. యువతలో బాధ్యతాయుత పౌరసత్వం, నాయకత్వ లక్షణాలను వారు ప్రతిబింబించారు. స్వచ్ఛతను ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలనే సందేశంతో ఈ కార్యక్రమం విజయవంతమైంది.

# ప్రజలు నుండి స్వీకరించిన ప్రతి అర్జీకి శాశ్వత పరిష్కారం చూపాలి.

● ఈ రోజు స్వీకరించిన అర్జీలు 246. ● రెండవ విడత "ఒక నెల - ఒక నియోజకవర్గం - నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన గ్రామసభ ● జిల్లా కలెక్టరుతో పాటు పాల్గొన్న ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు





**ఏలూరు/ నిడమర్రు, మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఉంగుటూరు నియోజకవర్గం నిడమర్రు మండల ప్రజాపరిషత్తు కార్యాలయ సమావేశమందిరంలో శుక్రవారం నిడమర్రు గ్రామానికి సంబంధించిన రెండవ విడత "ఒక నెల- ఒక నియోజకవర్గం- నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. జిల్లా కలెక్టరుతో పాటు ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొని, సంయుక్తంగా ప్రజలు నుండి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాల్లో దశలువారీగా రెవెన్యూ వివాదాలు లేని గ్రామాలుగా రూపొందించడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించుటకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టిపెట్టామని అన్నారు. గ్రామ ప్రజలు ఇచ్చిన అర్జీలు పరిష్కారంపై అధికార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులు ప్రతి గడపకు చేరేలా అధికారులు కృషిచెయ్యాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. ఒక్కసారి వచ్చిన అర్జీని క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఒకసారి వచ్చిన అర్జీ సక్రమంగా పరిష్కారం కాకుండా మరలా వచ్చినట్లయితే ఆయా అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టరు హెచ్చరించారు.ఈ సందర్భంగా ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ రెండవ విడత "వన్ మంత్ - వన్ విలేజీ -- ఫోర్ విజిట్స్" కార్యక్రమం గ్రామసభలో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి పాల్గొనుట మాకు ఎంతో సంతోషం కలిగిందని, నియోజకవర్గంలో సమస్యలు పరిష్కారంలో ప్రత్యేక దృష్టిపెట్టాలని అన్నారు. గ్రామ ప్రజలు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం చూపినట్లయితే గ్రామ ప్రజలు సమస్యలు తగ్గుతాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారులకు చేరేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.గ్రామాలు సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని ఇందుకు అధికార్లు మంచి సహకారం అందించాలని కోరారు.

**ఈ రోజు వచ్చిన అర్జీలలో కొన్ని.** నిడమర్రు మండలం తోకలపల్లి గ్రామనివాసి బరే కుటుంబరావు, వై.వెంకటస్వామిలు పెరిగిన జనాభాకు ఉన్న ఓహెచ్ఆర్ ట్యాంకు సరిపోవటం లేదని అది శిధిలావస్థకు చేరిందని, రెండవ ఓహెచ్ఆర్ ట్యాంకు మంజూరు చెయ్యాలని కోరారు, నిడమర్రు మండలం బువ్వనపల్లి గ్రామ నివాసి తన్నీడి విజయకుమార్ యుపి ప్రాథమిక పాఠశాల ప్రాంతాల్లో సీసీ రోడ్డులు, డ్రైనేజీ నిర్మాణాలు చెయ్యాలని కోరారు, నిడమర్రు మండలం పెదనిడ్రకోలను గ్రామనివాసి సి.హెచ్.వెంకటేశ్వర రావు శివాలయం చెరువుకు రక్షణ కొరకు గోడనిర్మాణం చేపట్టాలని కోరారు, నిడమర్రు మండలం క్రొవ్విడి గ్రామనివాసి వాకమూడి ఇంద్రకుమార్ మా స్వర్ణగ్రామ సచివాలయంలో వెల్ఫేరు అసిస్టెంటు, డిజిటల్ అసిస్టెంటు రెండు పోస్టులు భర్తీచెయ్యాలని, వాటరు కొరకు క్రొత్త పైపులైను మంజూరు చెయ్యాలని కోరారు, నిడమర్రు మండలం అడవికొలను గోలి పుండరీకాక్షుడు తాడేపల్లిగూడెం నుండి అడవికొలనుకు ఏపీఎస్ఆర్టీసీ బస్సుసౌకర్యం కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి ఆర్డీవో ఐ.కిషోరు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కె.షాజానాయక్, యంపిపి ధనికొండ ఆదిలక్ష్మి, జిల్లా, నియోజక వర్గం, మండల వివిధ శాఖలు అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఎక్కువ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

# జీహెచ్ఎంసీ పరిధిలోని..ప్రతి వార్డుకు భారత రాజ్యాంగం !

**- 300 వార్డులలో ఉచితంగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు**

**కాన్ఫడేరేషన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మైనార్టీస్ ఆర్గనైజేషన్స్ అధ్యక్షులు మహేశ్వర్ రాజు**




**హైదరాబాద్ మే 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని ప్రతి మున్సిపల్ వార్డులో భారత రాజ్యాంగం ప్రతులను ఉచితంగా పంపిణీ చేస్తామని "కాన్ఫడేరేషన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మైనార్టీస్ ఆర్గనైజేషన్స్" రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె. మహేశ్వర్ రాజు, కె.రామకృష్ణ తెలిపారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ లోని ఓ హోటల్ లో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఈ మేరకు సమిష్టి నిర్ణయం తీసుకున్నట్లు వారిరువురు ప్రకటించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని 300 వార్డులలోను భారత రాజ్యాంగం ప్రతులను పంపిణీ చేయడం జరుగుతుందని, ప్రతి వార్డులోను ఐదు రాజ్యాంగ ప్రతులను అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రాజు, కె.రామకృష్ణ మాట్లాడుతూ కాన్ఫడేరేషన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మైనార్టీస్ ఆర్గనైజేషన్స్ సంస్థ "సేవ్ కానిస్టిట్యూషన్ - సేవ్ ఇండియా" నినాదంతో "గ్రామ గ్రామం - రాజ్యాంగం" కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. దేశంలోని ప్రతి పౌరుడు భారత రాజ్యాంగం చదివాలనే గొప్ప సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. గత సంవత్సరం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, విద్యావేత్తలు, సామాజిక యాక్టివిస్టుల సమక్షంలో "గ్రామ గ్రామం రాజ్యాంగం" కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం లోని ప్రతి గ్రామం (సుమారు15 వేల గ్రామాలు)లతో పాటు మున్సిపాలిటీలలో, నగరాలతో పాటు హైదరాబాద్ మెట్రో నగరంలోని ప్రజలకు ఉచితంగా భారత రాజ్యాంగం ప్రతులను అందించడం తో పాటు భారత రాజ్యాంగంను ప్రతి ఒక్కరు అవగతం చేసుకునేలా తమ సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. తమ ఆర్గనైజేషన్ చేస్తున్న ఈ మహోన్నత కార్యక్రమంలో ప్రజాస్వామిక వాదులందరూ భాగస్వామ్యం అవుతారని ఆశిస్తున్నామన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని 300 వార్డులలో ప్రతి వార్డు కు ఐదు ప్రతులను అందించేందుకు ఏర్పాట్లు చేశామని,అయితే భారత రాజ్యాంగ ప్రతులను పంపిణీ చేయడానికి విద్యార్థులు యువకులు, సామాజిక కార్యకర్తలు నిబద్ధతతో పని చేయాలని ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా తమ ఆర్గనైజేషన్ చేపట్టిన పవిత్రమైన కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం ను కూడా ఆశిస్తున్నామని తెలిపారు. భారత రాజ్యాంగ రూపశిల్పి బాబా సాహెబ్ అంబేద్కర్ ఎంతో శ్రమించి తన జీవితాన్ని త్యాగం చేసి దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు భారత రాజ్యాంగాన్ని కానుకగా అందించారన్నారు. భారత రాజ్యాంగ విలువలు భారత పౌరుల హక్కులను ప్రజలకు తెలియడానికి గ్రామ గ్రామం భారత రాజ్యాంగం కార్యక్రమంను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. కాన్ఫడేరేషన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మైనార్టీస్ ఆర్గనైజేషన్స్ ముఖ్య నాయకుల సమావేశంలో ప్రొ.జి.మల్లేషం, తారిక్ మునీర్, ఎం. గంగాధర్, కోల జనార్ధన్, గడ్డం జాన్సీ, షాహనా ఖాన్, పీవీ రమణ, ఆనంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక'

**శామీర్‌పేట్, మే 22:(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజల సమస్యలను గ్రామ స్థాయి నుంచే గుర్తించి దశలవారీగా పరిష్కరించడమే ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.శుక్రవారం శామీర్‌పేట్ మండలం అంతాయిపల్లిలోని ఎస్ఎన్ఆర్ వేద కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలు, గ్రామీణ-పట్టణాభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రజల సమస్యలే పరిష్కారంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. 99 రోజులపాటు పది ప్రధాన అంశాలపై గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహించి నివేదికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఆ నివేదికల ఆధారంగా పెండింగ్ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని చెప్పారు.ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాల విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించి, సంబంధిత నియోజకవర్గానికి స్కూల్ మంజూరు చేయడం అభినందనీయమన్నారు.

# నేనంటే తెలుగంట - ఆ తెలుగుకు వెలుగుల పంట ఎవరంట!!




గురువు అనే పదం కేవలం పాఠాలు చెప్పే వ్యక్తిని మాత్రమే సూచించదు...మన జీవితాన్ని మలిచే మహోన్నత శక్తిని సూచిస్తుంది.మనలోని అజ్ఞానాంధకారాన్ని తొలగించి, మన వ్యక్తిత్వానికి వెలుగునిచ్చే ఆ మహోన్నత రూపమే గురువు.అందుకే "గురు బ్రహ్మ గురు విష్ణుః..." అని భారతీయ సంస్కృతి గురువుని దైవస్వ రూపంగా భావించి ంది.మనకు విద్య నేర్పిన గురువు ముందు మనం ఎంతటి స్థాయికి ఎదిగినా... ఎప్పటికీ చిన్నారులమే.ఆ భావనకు ప్రతిరూపంగా నిలిచిన ఒక మధుర క్షణం ఈ ఫోటో.ఒకప్పుడు ఇంగ్లీష్ మీడియం చదువుల్లో మునిగిపోయి, తెలుగుభాషలో తెల్లమొహం వేసుకుని కూర్చున్న ఓ విద్యార్థిని చూసి, అతని భవిష్యత్తు కోసం హృదయపూర్వకంగా ఆలోచించిన ఓ గురువు...వివాహం అనంతరం బరోడాలో నివసిస్తున్నప్పటికీ, తన శిష్యుడి పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయని గుర్తుచేసుకుని ప్రత్యేకంగా గుడివాడకు వచ్చి నాలుగు రోజుల పాటు ఇంటివద్దే తెలుగు తర్ఫీదు ఇచ్చి పరీక్షకు పంపి ఉత్తీర్ణుడిని చేసిన ఆ మహోన్నత ఉపాధ్యాయిని --- శ్రీమతి తుమ్మలపల్లి వాణీ కుమారి గారు. గురువు ప్రేమకు, శిష్యుడిపై చూపే అవ్యాజ ఆప్యాయతకు ఇది అరుదైన ఉదాహరణ.కాలం గడిచింది...ఆ విద్యార్థి ఆంగ్ల ఉపాధ్యాయునిగా విద్యారంగంలో స్థిరపడ్డాడు.కానీ అతని జీవితానికి అసలైన గుర్తింపునిచ్చింది తెలుగు భాషే.తెలుగు కవిత్వం, వ్యాసరచన, జర్నలిజం, సభా నిర్వహణ, వక్తృత్వం--- ఇలా అనేక రంగాల్లో ప్రత్యేక ముద్ర వేసేలా చేసిన పునాది ఆ గురువు బోధించిన తెలుగు భాషే.ఉప సంపాదకుడిగా, సంపాదకుడిగా సేవలు...బయోగ్రఫీ రచయితగా గౌరవ డాక్టరేట్......మూడు వేల పైచిలుకు సభలు .."సభా నిర్వహణ దక్ష", " సువర్ణ స్వర - సభా వాగ్భూషణ" వంటి బిరుదులు...14 గంటల నిరవధిక సభా నిర్వహణతో ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ "సుప్రీం యాంకర్ అవార్డు"...(2025)"నవ్వుల పొదరిల్లు" వంటి హాస్యరస కార్యక్రమాలు"గుడివాడ సాంస్కృతిక రాయబారి", "గుడివాడ వ్యాసమహర్షి", "కవి కిశోర్", "అభినవ శ్రీశ్రీ" వంటి బిరుదులు, గౌరవాలు...తెలుగు నాటకరంగ విజ్ఞానసర్వస్వ రచయితలలో ఒకరిగా గుర్తింపు...ప్రముఖుల పై 300 పైగా సంక్షిప్త, సమగ్ర జీవిత చరిత్రల రచన, వివిధ తెలుగు దినపత్రికలో పని చేసిన అనుభవం... పొట్టి శ్రీరాములు ఆఖరి రోజులపై రచన...ఈ విజయాల వెనుక నిలిచిన మూలశక్తి తెలుగు భాషపై లభించిన పట్టు.ఆ పట్టు వెనుక నిలిచిన గుట్టు గురువైన శ్రీమతి తుమ్మలపల్లి వాణీ కుమారి గారి అవ్యాజ ఆశీర్వచనం.అలాగే వాణీ కుమారి గారు కూడా తెలుగు, సంస్కృత భాషల ప్రచారానికి హైదరాబాద్ కేంద్రంగా విశేష సేవలందించారు. అందిస్తున్నారు..అమెరికా సహా పశ్చిమ దేశాలలో అనేక ప్రవచనాలు ఇచ్చి, వివిధ విశ్వవిద్యాలయాలలో బోధన నిర్వహించారు.రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలపై ప్రత్యేక రచనలు చేసి, ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం, దూరదర్శన్ సప్తగిరి, తిరుపతి, భద్రాచలం తదితర బ్రహ్మోత్సవాలలో వ్యాఖ్యాతగా సేవలందిస్తూ తెలుగు - సంస్కృతుల వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు.అలాంటి గురువు ముందు వినమ్రంగా కింద కూర్చుని, నాలుగు దశాబ్దాల క్రితం జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ గడిపిన ఆ మధుర క్షణాలు...ఈ ఫోటోలో కేవలం కనిపించేవి కాదు--- అనుభూతి చెందేవి.జీవితంలో ఎంత ఎత్తుకి ఎదిగినా...మన విజయాల వెనుక నిలిచిన గురువును గుర్తుంచుకుని వారి పాదాలవద్ద వినయంగా కూర్చోగలగడం కన్నా గొప్ప సంస్కారం మరొకటి లేదు.ఈ చిత్రం ఒక ఫోటో మాత్రమే కాదు..."గురువు - - శిష్య బంధం" అనే భారతీయ సంస్కృతికి చిరస్థాయి ప్రతిబింబం.ఇంతకీ ఆ భాగ్యవంతుడైన శిష్యుడిని నేనే....

**-డాక్టర్ ఎమ్మెస్వీ సత్యనారాయణ బాబు (కపర్ది)**

# సింగపూర్‌లో కోవిడ్ కలకలం

## వారంలో 59% కేసుల పెరుగుదల




సింగపూర్: కొవిడ్-19.. సింగపూర్‌ను భయపెడుతోంది. ఈ నెల 10 నుంచి 16 మధ్య 12,700 కొత్త కేసులు ఆ దేశంలో నమోదయ్యాయి. అంతకుముందు వారంతో పోలిస్తే 58.8% పెరుగుదల. అంతేకాదు.. ఈ కాలంలో కొవిడ్ కారణంగా ఆసుపత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య కూడా భారీగా పెరగడం గమనార్హం. అంతకుముందర్ని రోజువారీ సంఖ్య 56 ఉండగా, అది 73కు పెరిగింది. అయితే ఎలాంటి మరణాలు సంభవించలేదని సింగపూర్ వైద్యవర్గాలు తెలిపాయి. ప్రస్తుత కొవిడ్ వేరియంట్ ఎన్‌బీ.1.8.1పై వ్యాక్సిన్ సమర్థంగా పనిచేస్తాయని కూడా పేర్కొన్నాయి.

# గురుగ్రామ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాల ప్లాంట్‌లో భారీ అగ్నిప్రమాదం



గురుగ్రామ్ (హర్యానా) : గురుగ్రామ్‌లోని ద్వారకా ఎక్స్‌ప్రెస్ వే సమీపంలో సెక్టార్ 112లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాల ప్లాంట్‌లో శుక్రవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని మంటల్ని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఘటనా స్థలానికి పోలీసులు, పౌర రక్షణ బృందాలు కూడా చేరుకున్నారు. అయితే అగ్నిప్రమాదం సంభవించడానికి కారణం ఇంకా తెలియ లేదని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

# త్వరలో జాతీయ స్థాయి షటిల్ టోర్నమెంట్ పోటీలు..

● ఎన్టీఆర్ ఇండోర్ సింథటిక్ స్టేడియంను ప్రారంభించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



**గుడివాడ,మే 22 (వార్తాప్రభ) :** శుక్రవారం ఎన్.టి.ఆర్. ఇండోర్ స్టేడియం నందు షటిల్ కోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చేతుల మీదగా సింథటిక్ షటిల్ కోర్టును ప్రారంభించినారు. సభాధ్యక్షులు ఎన్.టి.ఆర్. స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాస రావు మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ క్రీడలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో ఈ స్టేడియంను నిర్మించారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా స్టేడియం కమిటీ గత 30 సం॥లుగా ప్రతి నెల క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతిరోజు 14 క్రీడలయందు శిక్షణ ఇస్తూ ఈ స్టేడియంను ఇంకా ఇంకా అభివృద్ధి చేస్తూనే ఉంది. అందులో భాగంగానే ఈ షటిల్ కోర్టు ఒకటి ఈ కోర్టు ఇంతక ముందు ఉడెన్లో ఉండేదని, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదేశానుసారం సింథటిక్ కోర్టుగా తీర్చిదిద్దిన్నట్లు తెలియజేశారు. జాతీయ స్థాయి క్రీడలు ఆడుకునే విధంగా ఈ కోర్టులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిడ్డంగుల సంస్థల చైర్మన్ రావి వెంకటేశ్వర రావు, ఎన్.టి.ఆర్. 'స్టేడియం కమిటీ జాయింట్ సెక్రటరీ కిలారపు రంగ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు గుండెమడ వెంకట రాఘవేంద్ర రావు, జీవిత సభ్యులు బొగ్గరపు తిరుపతయ్య, పిన్నమనేని పూర్ణ వీరయ్య (బాబ్జి), జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టి.డి.పి. పార్టీ నేతలు జగన్మోహన రావు, స్టేడియం సిబ్బంది మరియు కోచెస్ పాల్గొన్నారు.

# సర్వీస్ రూల్స్ వెంటనే అమలు చేయాలి

–పి ఆర్ టి యు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మర్రి ప్రభాకర్



**విజయవాడ,మే 22 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలులో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులకు సంబందించిన పలు సమస్యలను పరిష్కరించాలని పి.ఆర్.టి.యు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మర్రి. ప్రభాకర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వాటిలో ప్రధానంగా దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న ఉమ్మడి సర్వీస్ రూల్స్ ను, వెంటనే అమలు చేసి పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు జరుగుతున్న అన్యాయాన్ని నివారించి దశాబ్దాలుగా పదోన్నతికి నోచుకోని, గెజిటెడ్ హెడ్ మాస్టర్, స్కూల్ అసిస్టెంట్,సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు నెలవారీ పదోన్నతులు కల్పించాలని,మోడల్ ప్రాథమిక పాఠశాలలో, రాబోవు రెండు విద్యా సంవత్సరముల వరకు రేషనలైజేషన్ చేపట్టరాదని. వచ్చే విద్యా సంవత్సరం నుండి,లీప్ యాప్ నందు, ఎటువంటి సాంకేతిక సమస్యలు లేకుండా చూసి,ఉపాధ్యాయ,విద్యార్థుల హాజరు నమోదులో లోపాలను సవరించాలని,పాఠశాల నిర్వహణ నిమిత్తం అవసరమైన నిధులను పూర్తి స్థాయిలో విడుదల చేయాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు. గతంలో ఉపాధ్యాయులకు నిర్వహించిన, విద్యా సంబంధిత శిక్షణా కార్యక్రమాలకు రిసోర్స్ పర్సన్స్ కు, టి.ఎ మరియు డి.ఎ లను, రాబోవు శిక్షణా కార్యక్రమాల కంటే ముందు గానే చెల్లించాలని, పాఠశాల స్థాయిలో నిర్ణయించే లోకల్ హాలిడే, ఆప్షనల్ హాలిడే సెలవుల నిర్ణయాధికారం, రాష్ట్ర స్థాయిలో కాకుండా, అవసరాన్ని బట్టి యం.ఇ.ఒ మరియు ప్రధానోపాధ్యాయులకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పి.ఆర్.టి.యు రాష్ట్ర నాయకులు ఆవుల. రాంబాబు, పచ్చల.సునీల్ కుమార్,మండల అధ్యక్షుడు చాట్ల.నిరంజన్, జిల్లా నాయకులు కోతాటి.నరేష్, ఎస్.కె.కరీముల్లా, ఇస్లావత్.పుల్లయ్య, ఉప్పు.వెంకట్రావు,బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## పలు సమస్యలపై మంత్రి కీ వినతిపత్రం అందజేసిన నాయకులు



**పెనుగంచిప్రోలు, మే 22 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు లోని కంఠమనేని పంక్షన్ హాల్ నందు జరుగుతున్న ఎన్టీఆర్ జిల్లా బీజేపీ శిక్షణా తరగతుల సందర్భంగా వచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య శాఖమాత్యులు మరియు జిల్లా ఇంచార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ పెనుగంచిప్రోలు విచ్చేసిన సందర్భంగా వారికి పెనుగంచిప్రోలు ఏటి అవతల ఉన్న రహదారి విస్తరణ మరియు ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ మాజీ మండలాధ్యక్షులు వేగినేటి గోపాల కృష్ణమూర్తి మరియు నలమోలు వెంకట శివరామ ప్రసాద్, టీడీపీ అధికార ప్రతినిధి మంత్రి కు మెమోరాండమ్ సమర్పించారు.

## వైసిపి ప్రచార విభాగం జోన్ 3 వర్కింగ్ ప్రెసిడెంట్ గా మైలా రత్నకుమారి నియామకం....



**కృత్తివెన్ను,మే 22 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా పెడన అసెంబ్లీ నియోజకవర్గం కు చెందిన కృత్తివెన్ను జడ్పిటిసి మైల రత్నకుమారికి వైసిపి ప్రచార విభాగం జూన్ 3 వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమిస్తున్నట్లు తాడేపల్లి వైసిపి కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటించింది. ఈ సందర్భంగా రత్నకుమారి,పార్టీ అధిష్టానానికి, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, పెడన ఇంచార్జ్ ఉప్పాల రాముకు కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తారని అన్నారు. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా వైసిపి జిల్లా కార్యదర్శి వైధాని వెంకటరాజు జోన్ 3 ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమితులైన జెడ్ పి టి సి మైలా రత్నకుమారిని అభినందించారు...



శుక్రవారం 32వ రోజు గుడివాడ ఆర్టీసీ 11 నెంబర్ ప్లాట్ఫారం దగ్గర లైన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి వారి ఆధ్వర్యంలో 32వ రోజు ఉచిత కూలింగ్ వాటర్ చలివేంద్రం ప్రగతి సభ్యులు కట్టా రవీంద్ర, సతీమణి లక్ష్మీ గార్ల పెళ్లిరోజు సందర్భంగా ప్రగతి అధ్యక్షులు మాదల సురేష్ వితరణతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది ఈరోజు ఈ చలివేంద్ర ప్రారంభించిన రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గోకవరపు సునీల్, గవర్నర్ ఏరియా రిప్రజెంట్ రామదేని వేణుబాబు, సెక్రెటరీ పామర్తి కేశవరావు, పూర్వ అధ్యక్షులు మల్లంపల్లి వెంకటరావు, నల్లారి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

–గుడివాడ,మే 22 (వార్తాప్రభ) :

# పెడనలో కిషోరి వికాసం..

–పాల్గొన్న ఐసిడిఎస్ పీడీ రాణి



**పెడన,మే 22 (వార్తాప్రభ) :** సమగ్ర శిశువు అభివృద్ధి పథకం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు పట్టణంలోని 8 వ వార్డు గున్నాలపల్లిలో కిషోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. 1వ తేదీ నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు వివిధ రూపాలలో జరుగుతున్నాయి. వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం ఎన్ రాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిడి రాణి మాట్లాడుతూ కిషోరి వికాసం పేరుతో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. బాలికల విద్యతోనే సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. అలాగే పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యాన్ని రక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ సుధారాణి సూపర్వైజర్ పిట్ల కల్పవల్లి అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు కిషోరి బాలికలు పాల్గొన్నారు

## బంటుమిల్లి ప్రధాన కాలువ ఆధునీకరణ పనులను పరిశీలించిన కలెక్టర్...



**కృత్తివెన్ను,మే 22 (వార్తాప్రభ) :** బంటుమిల్లి లక్ష్మీపురం ప్రధాన కాలువ ఆధునీకరణ మరమ్మత్తు పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. సుమారుగా బంటుమిల్లి కృత్తివెన్ను మండలాలకు సంబంధించి 54 లక్షలతో చేపట్టే మరమ్మత్తు పనులను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ కు కావలసిన సమాచారం అంతా డి సి చైర్మన్ బొర్రా కాశి తెలియజేయగా కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. సందర్భంగా కలెక్టర్ డి సీ చైర్మన్ బొర్రా కాశి ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు కూటమి నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు..



గుడివాడ పండ్ల వర్తక సంఘం సభ్యులు బత్తుల నాగేశ్వరరావు అనారోగ్యం తో అకాల మరణం చెందినారు. పండ్ల వర్తక యూనియన్ తరపున యూనియన్ సభ్యులు కలిసి ఆయన మరణానికి చింతిస్తూ ఆయనకి ఘనమైన నివాళి అర్పిస్తూ ఆయన మట్టి ఖర్చులకు గాను 25000 రూపాయలు ఇవ్వటం జరిగింది ఈ కార్యక్రమంలో వర్తక అధ్యక్షులు గోకరకొండ బలరాం, పల్లవర్తక వైస్ ప్రెసిడెంట్ పెద్ది కిషోర్, గౌరవ సభ్యులు అప్పన్న, నైనాల చిన్న, పిడుగు గోపి, ట్రెజరర్ వెంకటరావు లు వారికి ప్రగాఢ సంతాపం తెలిపినారు.

–గుడివాడ,మే 22 (వార్తాప్రభ) :

# గుడివాడ ప్రజలను హడలెత్తిస్తున్న అగ్నిప్రమాదాలు..!



గుడివాడ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వేగవంతమైన స్పందనతో పెద్ద ప్రమాదాలు జరగకుండా సమర్థవంతంగా నివారించారు. వేసవి కాలంలోని అధిక ఉష్ణోగ్రతలు మరియు తీవ్రమైన వేడి పరిస్థితులను లెక్కచేయకుండా అగ్నిమాపక సిబ్బంది నిరంతరం సేవలందిస్తూ ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు అహర్నిశలు కృషి చేస్తున్నారు.







**గుడివాడ,మే 22 (వార్తాప్రభ) :** స్థానిక అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వేగవంతమైన స్పందనతో పెద్ద ప్రమాదాలు జరగకుండా సమర్థవంతంగా నివారించినట్లు సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి జె. ఆంజనేయులు తెలిపారు. తొలుత గుడివాడ అగ్నిమాపక కేంద్రం వాహనము మరియు సిబ్బంది ఈరోజు హనుమాన్ జంక్షన్ పరిధిలోని సేరి నరసన్నపాలెం ప్రాంతంలోని పొలాల్లో గడ్డి కోత అనంతరం మిగిలిన పొల అవశేషాలకు మంటలు అంటుకున్న ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని, వ్యవసాయ భూములకు మరింత నష్టం జరగకుండా పరిస్థితిని నియంత్రించడం జరిగింది. తదుపరి గుడివాడ పంపుల చెరువు వద్ద ఎలక్ట్రికల్ స్తంభానికి ఉన్న కేబుల్ వైర్లలో మంటలు అంటుకున్న సంఘటన స్థలానికి చేరుకుని, మంటలు మరింతగా వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకుంటూ నీటి సహాయంతో మంటలను సమర్థవంతంగా అదుపులోకి తీసుకువచ్చారు. అదేవిధంగా రాజేంద్రనగర్ ప్రాంతంలోని ఎలక్ట్రికల్ ట్రాన్స్ఫార్మర్లో మంటలు చెలరేగిన సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని అవసరమైన భద్రతా చర్యలు తీసుకుంటూ మంటలను సమర్థవంతంగా అదుపులోకి తీసుకున్నారు. ఇందిరానగర్, కొత్త కాలనీ పరిధిలో చెత్తకు మంటలు అంటుకుని సమీప నివాస ప్రాంతాలకు వ్యాపించే ప్రమాదాన్ని అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి నివారించారు. మొత్తం మీద నాలుగు వేర్వేరు అగ్ని ప్రమాద ఘటనలు పొలాల్లో గడ్డి మంటలు, ఎలక్ట్రికల్ కేబుల్ మంటలు, ట్రాన్స్ఫార్మర్ మంటలు మరియు చెత్త మంటలు, అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సమర్థవంతంగా నియంత్రించి పూర్తిగా ఆర్పివేశారు.

# బస్సులో ప్రయాణం..

● సైకిల్పై ప్రజా దర్బార్ కు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య







**పెనుగంచిప్రోలు, మే 22 (వార్తాప్రభ) :** జగ్గయ్యపేట నియోజకవర్గం ఎమ్మెల్యే మరియు తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్,తాతయ్య శుక్రవారం పెనుగంచిప్రోలు మండలం, అనిగండ్లపాడు గ్రామంలో నిర్వహించిన ప్రజాదర్బారు కార్యక్రమానికి ప్రత్యేకంగా బస్సులో ప్రయాణించి, అనంతరం సుమారు 5 కిలోమీటర్లు స్వయంగా సైకిల్ తొక్కుతూ ప్రజా దర్బార్ కు చేరుకున్నారు. ఖర్చుల అదుపు – వనరుల పొదుపు అనే నినాదానికి అనుగుణంగా ప్రజలతో మమేకమవుతూ ఎమ్మెల్యే ఈ నిరాడంబర ప్రయాణం ప్రజలను ఆకట్టుకుంది. అనిగండ్లపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బారులో గ్రామ ప్రజల సమస్యలను ఎమ్మెల్యే స్వయంగా విని అర్జీలు స్వీకరించారు. తాగునీరు, పెన్షన్లు, గృహాలు, రోడ్లు, విద్యుత్ తదితర సమస్యలపై సంబంధిత అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేశారు. ప్రజాదర్బారులో మొత్తం 127 అర్జీలు స్వీకరించబడినట్లు అధికారులు తెలిపారు. అందులో పెన్షన్లు -- 55, హౌసింగ్ -- 37, పంచాయతీరాజ్ -- 09, రెవెన్యూ -- 07, రోడ్లు, భవనాలు -- 10, విద్యుత్ -- 03, ఎన్ ఆర్ జీ ఎస్ -- 03, ఇతరాలు -- 03 అర్జీలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ ప్రజా సమస్యలను వారి చెంతకే వెళ్లి పరిష్కరించాలనే అద్భుతమైన ఉద్దేశంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. నెలలో నాలుగు శుక్రవారాలు నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం, ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కేవలం అర్జీలు స్వీకరించడం మాత్రమే కాకుండా, వాటికి పూర్తి జవాబుదారీతనంతో తప్పనిసరిగా పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని "గ్రీవెన్స్ ఫ్రీ విలేజ్" (సమస్యలు లేని గ్రామం)గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, కొఠారు సత్యనారాయణ ప్రసాద్, కళ్యాణశీ కృష్ణా రావు, అనిగండ్ల పాడు సొసైటీ అధ్యక్షులు అత్తులూరి అచ్చుత రావు, ఎం పిటిసి పొందూరు విజయ లక్ష్మి,దేవినేని సురేష్, తోటేం పూడి మురళీ, వెల్లి చంద్రశేఖర్,వివిధ హోదాలాల్లో వున్న వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జీవవైవిధ్యం తోనే మానవ మనుగడ

● సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు "ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు"



**విజయవాడ,మే 22 (వార్తాప్రభ) :** ప్రకృతిలో ప్రతి జీవి ఒకదానికి ఒకటి పరస్పర ఆధారితం, వివిధ జీవరాశుల వాటి గుణగణాలతో జీవనం సాగించడమే జీవవైవిధ్యం అని సాగు నీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు అన్నారు. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా దాని ప్రాముఖ్యత వివరిస్తూ ఈరోజు విజయవాడలోని రాష్ట్ర సమాఖ్య కార్యాలయం నుంచి ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు మాట్లాడుతూ ప్రపంచంలో ప్రజలందరు ప్రకృతి మీద ఆధారపడి జీవిస్తున్నారని, 40శాతం ఆర్థిక వ్యవస్థ దీని మీదే ఆధారపడి ఉందని, పర్యావరణాన్ని సమతుల్యంగా ఉంచడానికి వైద్య విభాగంలో మందుల తయారీకి, వ్యవసాయరంగానికి ఇతరత్రా అనేక పరిశోధనలు సజావుగా సాగటానికి జీవ వైవిధ్యమే కారణం అన్నారు. మానవుడు ఆహారం కోసం వృక్ష, జంతు జాతులు మీదనే ఆధారపడి ఉన్నాడని మానవులు ఉపయోగించే వస్త్రాలు, సుగంధద్రవ్యాలు, లూబ్రికెంట్స్ తయారయ్యే ఏ పరిశ్రమలు తీసుకున్నా వృక్ష, జంతు జాతులకు సంబంధించినవే అని అలాంటప్పుడు జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సమాజంలో అందరూ గుర్తించాలి అన్నారు. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 1993 తీర్మానం ప్రకారం అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం మే 22న జరుపుకోవాలని తీర్మానం చేసిందని ఈ సంవత్సరం 2026 "ప్రపంచవ్యాప్త ప్రాభవంకోసం స్థానికంగా వ్యవహరించడం" ఒక తీమ్ గా నిర్ణయిచారని, పెరుగుతున్న జనాభాతో పాటు అడ్డూ అదుపులేని వనరుల వినియోగం, అవసరానికి మించి భూముల వినియోగం వల్ల జీవ వైవిధ్యానికి ముప్పు వాటిల్లుతుందని, కాలుష్య ప్రభావం వల్ల ఎబోలా, ఇన్ ఫ్లుంజా ఫ్లూ, కారోనా వ్యాధులను మానవుడు అనుభవించాల్సి వచ్చిందని ఈ విషయాన్ని మానవులు అందరూ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పౌర సమాజంలో మార్పు రాకపోతే సార్థకత ఉండదని, ఈ ప్రపంచం మనకు మాత్రమే సొంతం కాదు మనతో పాటు ఉన్న ఇతర జీవులకు కూడా సొంతం అనే విషయాన్ని గ్రహిస్తేనే మానవ మనుగడ సాధ్యమని అర్థం చేసుకోవాలని జీవ వైవిధ్యాన్ని కాపాడే మానవీయ సమాజం ఏర్పాటు చేయటం అందరి తక్షణ కర్తవ్యం అన్నారు.

# చౌటపల్లిలో బడిబాట



**చౌటపల్లి (తిరువూరు రూరల్ ),మే 22 (వార్తాప్రభ) :** బడి పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం చౌటపల్లి గ్రామంలో బడి బాట కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి. శిరీష, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ జి. మా రేశ్వరరావు, ఎల్టా ప్రతినిధి యం. రాం ప్రదీప్ మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# భానుడి భగ భగలకు తగలబడుతున్న కొండలు..

## •వెల్దుర్తిపాడులో దావాగ్ని




**పెనుగంచిప్రోలు, మే 22 (వార్తాప్రభ) :** రాజేశ్వరి గట్టును చుట్టుముట్టిన రాకాసి మంటలు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు పెడుతున్న గ్రామస్తులు. పెనుగంచిప్రోలు మండలం లోని వెల్దుర్తి పాడు గ్రామం లో నిప్పుల కొలిమిలా మారిన ఎండల తీవ్రతకు ఊహించని ఘోరం జరిగిపోయింది. పెనుగంచిప్రోలు మండలం గుమ్మడిదుర్రు గ్రామం వద్ద ఉన్న గట్టు (కొండ) పై గురువారం మధ్యాహ్నం ప్రకృతి ప్రకోపించింది. ఆకాశం నుంచి కురుస్తున్న నిప్పుల వర్షానికి, తట్టుకోలేని నడినెత్తి ఎండల వేడికి కొండపై ఉన్న ఎండుగడ్డి, పొదలు వాటంతట అవే అంటుకుని సజీవ దహనమవుతున్నాయి. ఈదురుగాలుల తోడవడంతో క్షణాల వ్యవధిలోనే ఈ అగ్ని కీలలు కొండ నలుమూలలా విస్తరించి అగ్నిపర్వతాన్ని తలపిస్తున్నాయి. కొండపై నుంచి ఎగిసిపడుతున్న రాకాసి మంటలు, దట్టమైన పొగలు చుట్టుపక్కల గ్రామాన్ని పూర్తిగా కమ్మేశాయి. అగ్నివలయంలో 'రాజేశ్వరి గట్టు'. గజగజ వణుకుతున్న జనం. ఈ అగ్నిప్రళయంలో అత్యంత భయానకమైన దృశ్యం ఏమిటంటే.. ప్రసిద్ధ 'రాజేశ్వరి గట్టు' చుట్టూ మంటలు అలుముకుని ఒక భయంకరమైన అగ్నివలయంలా మారిపోయింది. మంటలు గట్టును నలువైపులా చుట్టుముట్టేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు గుండెలు బాదుకుంటున్నారు. కొండ కింద ఉన్న గ్రామం లోని ఇళ్లకు, పంట పొలాలకు ఈ మంటలు తాకితే జరిగే ఆస్తి, ప్రాణ నష్టాన్ని ఊహించడానికే జనం గజగజ వణికిపోతున్నారు. అధికారులారా తక్షణమే కదలండి పరిస్థితి చేతులు దాటిపోకముందే అగ్నిమాపక శకటాలు, విపత్తు నిర్వహణ బృందాలు, రెవెన్యూ అధికారులు శరవేగంతో రంగంలోకి దిగాలి. గుమ్మడిదూరు గ్రామాన్ని, చుట్టుప్రక్కల ఉన్న గ్రామాలు అన్నిటిని పవిత్ర రాజేశ్వరి గట్టును ఈ అగ్నిప్రళయం నుంచి కాపాడటానికి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ప్రజలు ముక్తకంఠంతో అత్యంత ఆవేదనతో డిమాండ్ చేస్తున్నారు.

# ఈ నెల 24న సివిల్స్ ప్రిలిమ్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

**• 10,119 మంది అభ్యర్థులు పరీక్ష రాసేందుకు 23 కేంద్రాలు • అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలి • జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**





**విజయవాడ,మే 22 (వార్తాప్రభ) :** యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఈ నెల 24న దేశవ్యాప్తంగా సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించనున్న నేపథ్యంలో పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని.. అయినా అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ.. యూపీఎస్సీ ఇన్‌స్పెక్టింగ్ అధికారులు హర్వేష్ కుమార్, సునీల్ కుమార్‌తో కలిసి కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ నిర్వహణపై సమన్వయ సమావేశం నిర్వహించారు. అత్యంత ప్రతిష్టాత్మక సివిల్స్ ప్రిలిమ్స్‌ను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై మార్గనిర్దేశనం చేశారు. విజయవాడలో 23 ఉప కేంద్రాల్లో 10,119 మంది అభ్యర్థులు పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేశామని.. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అభ్యర్థులు పరీక్ష రాసేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ నెల 24న ఆదివారం ఉదయం 9.30 గం. నుంచి 11.30 గం. వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 గం. నుంచి 4.30 గం. వరకు పేపర్-2కు పరీక్ష జరగనుందన్నారు. పరీక్ష ప్రారంభానికి 30 నిమిషాల ముందే కేంద్రం లోపలకు రావాల్సి ఉంటుందని.. అందువల్ల అభ్యర్థులు ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. మొబైల్ ఫోన్లు, ఐటీ గాడ్జెట్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి లైజన్ ఆఫీసర్ కమ్ లోకల్ ఇన్‌స్పెక్టింగ్ ఆఫీసర్స్, వెన్యూ సూపర్‌వైజర్లు, ఇన్విజిలేటర్లు తదితరులను నియమించినట్లు వెల్లడించారు. రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్యం, విద్యుత్, ఏపీఎస్ఆర్‌టీసీ, మునిసిపల్, పోస్టల్ తదితర శాఖల అధికారుల సమన్వయంతో పనిచేసి పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు కృషిచేయాలన్నారు. వేసవి నేపథ్యంలో తాగునీరుతో పాటు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ ఆర్‌డీవో వెన్నెల శ్రీను, సమన్వయ శాఖల అధికారులు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

# ఈవీఎం, వీవీప్యాట్ గోదాముకు పటిష్ట భద్రత - జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,మే 22 (వార్తాప్రభ) :** ఈవీఎం, వీవీప్యాట్ గోదాముకు పటిష్ట భద్రత కల్పించడం జరిగిందని.. అయినప్పటికీ నిరంతర పర్యవేక్షణతో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సాధారణ నెలవారీ తనిఖీల్లో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్ల గోదామును పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరుతో పాటు అగ్నిమాపక విద్యుత్ పరికరాలను పరిశీలించి అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్లో సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్లను భద్రపరుస్తున్న గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికను అందించడం జరుగుతోందన్నారు. అదేవిధంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనూ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. ఈవీఎం, వీవీప్యాట్ల గోదాము తనిఖీలో జిల్లా కలెక్టర్‌తో పాటు డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, బి.మురళీకృష్ణ (భారత జాతీయ కాంగ్రెస్), ఏదుపాటి రామయ్య (తెదేపా), గాలంకి వెంకటేశ్వరరావు (బీఎస్‌పీ), జగడం శ్రీనివాసరావు (జనసేన పార్టీ), కందుల పరమేశ్వరరావు (ఏఏపీ), యారడ్ల ఆంజనేయ రెడ్డి (వైఎస్ఆర్‌సీపీ) తదితరులు పాల్గొన్నారు.

# జడ్పీ హెచ్‌ఎంలు, ఎంఈఓ పోస్టులను జోనల్ పోస్టులుగా గుర్తించాలి : ఫోర్ట్

**విజయవాడ,మే 22 (వార్తాప్రభ) :** జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు మరియు మండల ఎడ్యుకేషన్ అధికారులు (ఎంఈఓ లు) పోస్టులను ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయబోయే లోకల్ క్యాడర్ ఆర్గనైజేషన్‌లో జోనల్ పోస్టులుగా చూపించాలని ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్స్ అసోసియేషన్ (ఫోర్ట్) పక్షాన స్పెషల్ చీఫ్ సెక్రటరీ సర్వీసెస్ (జిఏడి) ఎస్.ఎస్. రావత్ ని కలిసి విజ్ఞప్తి చేశారు. ఫోర్ట్ పక్షాన డి.పి.ఆర్.టి.యు.రాష్ట్ర అధ్యక్షులు డి. శ్రీను, నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి శ్రీనివాసరావు, పిజిటి అసోసియేషన్ అధ్యక్షులు వీరయ్య పాల్గొన్నారు. ప్రస్తుతం విద్యా వ్యవస్థలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఈ పోస్టులకు సరైన పరిపాలనా ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందని సంఘం పేర్కొంది. ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుల పోస్టుల మాదిరిగానే జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు మరియు మండల ఎడ్యుకేషన్ అధికారులు పోస్టులను కూడా జోనల్ పోస్టులుగా గుర్తింపు ఇవ్వడం ద్వారా పదోన్నతులు, బదిలీలు మరియు పరిపాలనా వ్యవస్థలో సమన్యాయం సాధ్యమవుతుందని అభిప్రాయపడింది. ఉపాధ్యాయుల హక్కులు, విద్యా



పరిపాలనలో పారదర్శకత మరియు సమర్థతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే ఈ అంశంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్స్ అసోసియేషన్ కోరింది. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, సయ్యద్ షెహనాజ్ తదితరులు పాల్గొన్నారు.

# అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న సినీ నటుడు మహేష్ బాబు

**• ఫ్యాన్స్ ఆధ్వర్యంలో చిన్నారులకు హృదయ సంబంధిత ఆరోగ్య పరీక్షలు**

**• అమలాపురం కోనసీమ కేర్ హాస్పిటల్ వద్ద ఉచితంగా పరీక్షలు, శస్త్రచికిత్సలు**



**అమలాపురం,మే 22 (వార్తాప్రభ) :** అమలాపురం పట్టణంలో మహేష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు గుండె సంబంధిత వ్యాధుల నిర్ధారణ కోసం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా జరిగింది. శుక్రవారం స్థానిక నల్ల వంచన వద్దనున్న కోనసీమ కేర్ వైద్యులు కారెం రవితేజ హాస్పటల్లో నిర్వహించిన ఈ ప్రత్యేక శిబిరానికి విజయవాడకు చెందిన ప్రముఖ హార్ట్ స్పెషలిస్ట్ డాక్టర్ లింగ స్వామి హాజరై చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 150 మంది చిన్నారులకు గుండె సంబంధిత ఆరోగ్య పరీక్షలు చేపట్టారు. చిన్నారుల్లో గుండె సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి సరైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. వైద్య పరీక్షల కోసం వచ్చిన చిన్నారులు, వారి తల్లిదండ్రులకు వైద్యులు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాన్ని మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు ఎంతో సమన్వయంతో నిర్వహించారు. మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పిశెట్టి నరసింహ, ఆధ్వర్యంలో దొమ్మేటి స్వామి, పాటి రవి, దొమ్మేటి శ్రీను, కె. రమేష్, కాలే గోవిందు, తదితర కొప్పాడి రమేష్, దంగేటి కనక , సంసాని రమేష్ అభిమానులు శిబిర ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. డాక్టర్ లింగ స్వామి ని ప్రత్యేకంగా విజయవాడ నుంచి తీసుకువచ్చి ఉచితంగా వైద్య సేవలు అందించడం పట్ల రోగుల బంధువులు, స్థానిక ప్రజలు మహేష్ బాబు అభిమానులను అభినందించారు. చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహేష్ బాబు అభిమానులు మాట్లాడుతూ తమఅభిమాన సినీ నటుడు మహేష్ బాబు ఇప్పటికే 4,000 మందికి పైగా చిన్నారులకు గుండె సంబంధిత చికిత్సలు అందించి ఎందరికో ప్రాణదాతగా నిలిచారని గుర్తుచేశారు. ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకుని కోనసీమలో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి పేద ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు వెల్లడించారు. స్థానికంగా నిర్వహించిన ఈ వైద్య శిబిరం చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని ప్రజలు అభిప్రాయపడ్డారు. అనంతరం మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆధ్వర్యంలో డాక్టర్ లింగస్వామి, అమలాపురం కోనసీమ కేర్ హాస్పిటల్ డాక్టర్ కారెం రవితేజలకు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

# పెట్టుబడిదారులకు అండగా ఇన్వెస్టర్స్ డెస్క్..

**• జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు • సింగిల్ విండో సెల్‌తో వేగవంతమైన సేవలు**

**• పారిశ్రామిక అభివృద్ధికి కలెక్టర్ డా. జి.లక్ష్మీశ నూతన చొరవ**





**విజయవాడ, మే 22 (వార్తాప్రభ) :** జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు అన్ని విధాలా చేయూతనందించేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఇన్వెస్టర్స్ డెస్క్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. పరిశ్రమల స్థాపనతో స్థానిక యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రావడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, స్థానిక వనరుల వినియోగ సామర్థ్యమూ మెరుగుపడి సుస్థిర అభివృద్ధికి వీలవుతుందని పేర్కొన్నారు. కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లోని ఇన్వెస్టర్స్ డెస్క్ - సింగిల్ విండో సెల్ ద్వారా ఔత్సాహికులకు అన్ని విధాలా చేయూతనందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ డెస్క్ ద్వారా పెట్టుబడిదారులు పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులు, లైసెన్సులు, శాఖల సమన్వయం వంటి అంశాలలో సులభతర సేవలు అందించడంతో పాటు, వివిధ రకాల సేవలకు మార్గనిర్దేశనం చేయడం జరుగుతుందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అందుబాటులో ఉన్న వివిధ పథకాలు, ప్రోత్సాహకాలు వంటి సమాచారాన్ని అందించడంతో పాటు పారిశ్రామిక యూనిట్లను విజయవంతంగా నడిపించేందుకు మార్గదర్శనం లభిస్తుందని వివరించారు. పరిశ్రమలు నడపటంలో ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే వాటి పరిష్కారానికీ చేయిపట్టి నడిపించడం జరుగుతుందన్నారు. జిల్లాలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పిస్తూ, కొత్త పరిశ్రమల స్థాపనకు జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందన్నారు. జిల్లాలో పరిశ్రమలు స్థాపించాలనుకునే పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలకు అనువైన, అవసరమైన భూమిని సమకూర్చడానికి అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు డీఐసీ జనరల్ మేనేజర్ ఎం.మధు (98857 29555), ఇన్వెస్టర్ డెస్క్ ఇన్‌ఛార్జ డా. సుమన్ (94943 75951)ను సంప్రదించవచ్చని తెలిపారు.

**జి.కొండూరులో సీబీజీ ప్లాంటు!:** ఇటీవల గౌరవ ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన ఎస్ఐపీబీ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లాలో ఐవోసీ-జీపీఎస్ సంస్థచే స్థాపించబోయే కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంటు ప్రతిపాదనకు ఆమోదం లభించిందని కలెక్టర్ తెలిపారు. ఈ పరిశ్రమ జి.కొండూరు మండలంలోని కడింపోతవరం గ్రామం పరిధిలో రానుంది. ఇందుకు అవసరమైన భూమిని ఐవోసీ జీపీఎస్‌కు ఈ సంస్థ మాతృ సంస్థ అయిన ఐవోసీ లిమిటెడ్ తనకు చెందిన భూమిలో కొంత భూమిని కేటాయిస్తున్నారన్నారు. ఈ పరిశ్రమ ద్వారా జిల్లాకు రూ. 120 కోట్ల పారిశ్రామిక పెట్టుబడులు రానున్నాయని.. ఈ పరిశ్రమ ద్వారా 200 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.

# వెటరన్ జర్నలిస్ట్ డైరీని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

## -పెన్షన్ మంజూరు కై ప్రభుత్వానికి సిఫార్సు :: జిల్లా కలెక్టర్



**తిరుపతి,మే 22 (వార్తాప్రభ) :** వెటరన్ జర్నలిస్ట్ లకు పెన్షన్ మంజూరు కోసం రాష్ట్ర ప్రభుత్వానికి సిపార్సు చేస్తామని తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలియజేయారు. శుక్రవారం తిరుపతి కలెక్టర్ చాంబర్ లో ఉమ్మడి చిత్తూరు జిల్లా వెటరన్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తీసికువచ్చిన 2025-26 సంవత్సరపు డైరీని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెటరన్ జర్నలిస్ట్ ల సంక్షేమం కోసం జిల్లా అసోసియేషన్ చేస్తున్న కృషిని కొనియాడారు. దేశవ్యాప్తంగా 19 రాష్ట్రాలలో వెటరన్ జర్నలిస్ట్ లకు ప్రభుత్వాలు పెన్షన్ అందజేస్తున్నట్లు అసోసియేషన్ నేతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలు మాత్రమే దక్షిణ భారత్ లో ఈ విషయం లో వెనకబడ్డాయని పేర్కొన్నారు. అర్హులైన సీనియర్స్ జర్నలిస్ట్ లకు పెన్షన్ మంజూరు విషయం ఎంతో సమంజసమని రాష్ట్ర ప్రభుత్వంనకు సానుకూలంగా ప్రతిపాదన పంపగలనని కలెక్టర్ భరోసా ఇచ్చారు ..ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, జాతీయ ఉపాధ్యక్షులు డా. టి. జనార్ధన్, జిల్లా కార్యదర్శి కె. చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి యం. సుబ్రమణ్యంరెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ ను దుశ్శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమం లో సీనియర్ జర్నలిస్ట్ లు యాసిన్, జి. సుకుమార్, కృష్ణమూర్తి, మునికృష్ణయ్య, సుధాకర్ రెడ్డి, రాజగోపాల్, అల్లాభక్ష్, కోటయ్య, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తగలబడుతున్న రైతు పంట పొలాలను కాపాడిన ఫైర్ సిబ్బంది

**• ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) దూరదృష్టికి రైతుల ప్రశంసలు....**




**పెనుగంచిప్రోలు,మే 22 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండలం, కొనకంచి గ్రామంలో శుక్రవారం ఒక రైతుకు చెందిన పంట పొలంలో అకస్మాత్తుగా అగ్నిప్రమాదం సంభవించి, మంటలు వేగంగా వ్యాపించడంతో రైతులు, గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. గ్రామస్తులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించినప్పటికీ, ప్రధాన ఫైర్ ఇంజన్ అప్పటికే మరో గ్రామంలో జరిగిన అగ్నిప్రమాద నియంత్రణ కార్యక్రమంలో నిమగ్నమై ఉండటంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకోవడం సాధ్యపడలేదు. ఈ అత్యవసర సమయంలో జగ్గయ్యపేట నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) రైతుల భద్రత కోసం వినూత్నంగా రూపొందించిన జగ్గయ్యపేట మినీ ఫైర్ ఇంజన్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చింది. మంటలు మరింత విస్తరించకుండా నిలువరించడంతో పాటు రైతుకు సంభవించే భారీ పంట నష్టం తప్పింది. తక్షణ స్పందనతో జరిగిన ఈ చర్య రైతులకు ఎంతో ఉపశమనాన్ని కలిగించింది. ఈ ఘటనను ప్రత్యక్షంగా చూసిన స్థానిక రైతులు, గ్రామస్తులు ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ముందుచూపు, సృజనాత్మక ఆలోచన, రైతుల పట్ల ఉన్న అంకితభావాన్ని ప్రశంసించారు. గ్రామ స్థాయిలోనే అగ్నిప్రమాదాలకు ఎదుర్కొనే సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. దబ్బాగుపల్లి గ్రామంలో జరిగిన భారీ అగ్నిప్రమాద ఘటన నేపథ్యంలో రైతుల నష్టాన్ని గమనించిన ఎమ్మెల్యే తాతయ్య , గ్రామాల్లో అందుబాటులో ఉన్న వాటర్ ట్యాంకర్లకు హై ప్రెషర్ మోటార్, ఫైర్ నాజిల్ అమర్చి కేవలం సుమారు రూ.30 వేల వ్యయంతో మినీ ఫైర్ ఇంజన్లుగా వినియోగించే వినూత్న ఆలోచనను అమలు చేశారు. ప్రస్తుతం ఈ జగ్గయ్యపేట మోడల్ అత్యవసర పరిస్థితుల్లో రైతులకు రక్షణ కవచంగా నిలుస్తోంది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రజల అవసరాలను ముందుగానే గుర్తించి పరిష్కారాలను అందించే నాయకుడు శ్రీరాం తాతయ్య అత్యవసర సమయంలో గ్రామస్థులకు అండగా నిలిచే విధంగా రూపొందించిన మినీ ఫైర్ ఇంజన్ నేడు మా పంటను కాపాడింది. ఇలాంటి ప్రజా నాయకత్వం ప్రతి ప్రాంతానికి అవసరం అని అభిప్రాయపడ్డారు. కొనకంచి గ్రామంలో జరిగిన ఈ ఘటనతో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ప్రజా సంక్షేమ దృక్పథం, రైతుల పట్ల ఉన్న బాధ్యతాభావం, ముందుచూపుతో కూడిన పాలన మరోసారి ప్రజల ప్రశంసలు అందుకుంది....

# రామరాజు పాలెం ఛానెల్ ను పరిశీలించిన కలెక్టర్



**పెడన,మే 22 (వార్తాప్రభ) :** పెడన రామరాజుపాలెం ఛానల్ ని జిల్లా కలెక్టర్ బాలాజీ శుక్రవారం పరిశీలించారు. రామరాజుపాలెం ఛానల్ ఇబ్బందుల్ని రైతాంగం పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ సూచనల మేరకు కలెక్టర్ దృష్టికి గూడూరు డీసీ చైర్మన్ పోతన స్వామినాయుడు తీసుకెళ్లడం జరిగింది . తప్పనిసరిగా న్యాయం చేస్తానని కలెక్టర్ హామీ ఇవ్వడం కూడా జరిగింది. ఈ కార్యక్రమంలో స్వామి నాయుడు తోపాటు ఇరిగేషన్ ఈ ఈ రవి డిఈ అపర్ణ ఇరిగేషన్ ఏఈలు పెడన నీటి సంఘం అధ్యక్షులు కమ్మగంటి వెంకటేశ్వరరావు గూడూరు బిజెపి అధ్యక్షులు కోలపల్లి రజనీ కుమార్ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు భాస్కర్ కంభం పవన్ కిరణ్ మహేష్ పాల్గొనడం జరిగింది

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188